

70 శాతం పూర్తి చేసినా పాడుబెట్టారు..

2017 చివర్లో రూ.160 కోట్లతో అప్పటి టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. 2019 ఎన్నికల నాటికి దాదాపు 70శాతానికి పైగా పనులను పూర్తి చేశారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధానిలోని భవనాల నిర్మాణ పనులను నిలిపివేసింది. తుది మెరు గులతో ఉపయోగించుకునే అవకాశం ఉన్నా సీఆర్‌డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ పాలకులు పాడుబెట్టారు.

అలుమ్నికి.. ఆటంకాలు

- బాపట్ల ఏజీ కళాశాలలో అనేక సమస్యలు
- నిధులు సమకూర్చడానికి పూర్వ విద్యార్థుల ఆసక్తి
- ఎన్జీ రంగా యూనివర్సిటీ పెద్దల నుంచి కనబడని చొరవ
- నేడు అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు ప్రారంభోత్సవం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

'ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు మూలాలు మరిచిపోకూడదు. ఎంతోకొంత వితరణ రూపంలో ఇవ్వడం సామాజిక బాధ్యతగా భావించాలి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు వేదికలపై చెప్తుంటారు. చంద్రబాబు స్ఫూర్తితో ఎందరో పుట్టిపెరిగిన గ్రామాలకు.. విద్య నేర్పి తమను ఉన్నత స్థాయికి చేర్చిన పాఠశాల, కళాశాలకు తమవంతు బాధ్యతగా కొన్ని పనులు చేపట్టి వాటి అభివృద్ధికి దోహదపడుతున్నారు. ఈ క్రమంలో దాతలను గ్రామ పెద్దలు, విద్యా సంస్థల నిర్వాహకులు ప్రత్యేకంగా ఆదరిస్తూ అభిమానిస్తూ.. వారి పట్ల కృతజ్ఞతగా ఉంటున్నారు. అయితే ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పెద్దల తీరు ఇందుకు భిన్నంగా ఉంది. వర్సిటీ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్య అభ్యసించి వ్యవసాయ రంగంలోనే కాకుండా శాస్త్ర, రాజకీయ, పాలన, ఆర్థికరంగంలో తమదైన ముద్రవేసిన వారు సాగుబడిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిధులను సమకూరుస్తున్నారు. వారిచ్చిన రూ.2 కోట్ల విరాళాలతో నిర్మాణం పూర్తి చేసుకున్న అలుమ్ని హౌస్ మొదటి అంతస్తు బుధవారం ప్రారంభం కానుంది. అయితే ఆయా నిధులు సమకూర్చిన పూర్వ విద్యార్థులకు వర్సిటీ నుంచి కనీస ప్రాధాన్యం దక్కడంలేదన్న విమర్శలున్నాయి. పూర్వ విద్యార్థులను ఓ చోటకు చేర్చి కళాశాల అభివృద్ధికి సహకారం కోరడంపై కూడా వర్సిటీ పెద్దల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాలకు స్వచ్ఛందంగా నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వారి విషయంలో కనీస గుర్తింపు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండటంపై కూడా విమర్శలు వస్తున్నాయి. పోతన హాస్టల్ భవనం ఆధునికీకరణకు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, శ్రీహరిరెడ్డి ముందుకు రాగా వారి కోరికకు సానుకూల స్పందన లేకపోవడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన గోవింద రాజులు నాబార్డ్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కళాశాలకు అగ్రిహబ్‌ను మంజూరు చేశారు. అయితే అప్పట్లో ఉన్న వీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో ఈ అగ్రిహబ్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు తరలిపోయింది. పూర్వ విద్యార్థి ఒకరు కళాశాలలోని పెవిలియన్ ఆధునికీకరణను దాదాపు రూ.15 లక్షలు వెచ్చించారు. 1980 బ్యాచ్‌కు చెందిన హరిప్రసాద్ రైతు సమాచార కేంద్రం నిర్మాణానికి భారీ విరాళం ఇచ్చారు. ఇలా భారీ విరాళం ఇచ్చిన వారి పేర్లను సదరు విభాగాలకు పెట్టడం వల్ల మరింత మంది పూర్వ విద్యార్థులు ముందుకు రావడానికి ప్రేరణ ఇచ్చినట్లవుతోంది. కానీ ఈ విషయంలో కూడా నిబంధనల పేరుతో వారికి సముచిత గౌరవం ఇవ్వడంపై కూడా యూనివర్సిటీ నిర్లక్ష్యం ప్రదర్శించడంతో విమర్శలను (మిగతా 8వ పేజీలో)



అలుమ్ని హౌస్ ఇదే



● నిర్మాణంలో ఉన్న ఏపీ సీఆర్‌డీఏ పరిపాలనా భవనం

సిద్ధమవుతున్న సీఆర్‌డీఏ భవనం

- ఇందులోనే ఏడీసీఎల్ కార్యాలయం
- జీప్లస్ 7గా నిర్మాణం.. నెల రోజుల్లో పూర్తి
- రాజధాని అమరావతిలో మొదటి ప్రభుత్వ భవనం ఇదే

అత్యద్భుతంగా.. ఆకర్షణీయంగా.. అత్యాధునికంగా.. సకల సౌకర్యాలతో.. అమరావతి రాజధానిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనంగా సీఆర్‌డీఏ కార్యాలయం సిద్ధమవుతోంది. సీడ్ యాక్సిస్ రోడ్డుకు దక్షిణంగా ఎన్-8, ఎన్-9ల మధ్య చేపట్టిన ఈ భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ భవనం మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో...అత్యంత వైవిధ్యంగా... మరెంతో ఆకర్షణీయంగా.. ప్రత్యేకంగా కనిపించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యాలయ భవనాన్ని అమరావతిలో ఓ రోల్‌మోడల్‌గా నిలిచేలా సీఆర్‌డీఏ అధికారులు నిర్మిస్తున్నారు. గత టీడీపీ హయాంలోనే 70 శాతం నిర్మాణం పనులు పూర్తి కాగా తిరిగి చంద్రబాబు గత ఏడాది ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ భవనానికి పునః శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఏప్రిల్ మూడో వారంలో రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో ప్రారంభించే సమయానికల్లా సీఆర్‌డీఏ కార్యకలాపాలను రాజధాని నుంచే ఆరంభించాలన్న లక్ష్యంతో ఈ భవన నిర్మాణాన్ని వేగంగా చేపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

ఆంధ్రుల కలల రాజధాని అమరావతిలో మొట్టమొదటి ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైపోతుంది. రాజధాని అమరావతి నిర్మాణపనుల పర్యవేక్షణ బాధ్యతలను తలకెత్తుకున్న ఏపీ సీఆర్‌డీఏ తన ప్రధాన కార్యాలయ భవనాన్ని అన్నింటికన్నా ముందే ఏర్పాటు చేసుకునేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతిలో గవర్నమెంటు కోర్‌లో ఒక వైపుగా సీడ్ యాక్సిస్ రోడ్డు వెంబడి రాయపూడికి దగ్గర్లో సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం జీ+సెవన్ భవనంగా.. అన్ని హంగులతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటుంది. సీఆర్‌డీఏకు కేటాయించిన మూడు ఫ్లోర్లకు సంబంధించి ఇంటర్నల్ వర్కులు దాదాపు 90శాతం వరకు పూర్తయ్యాయి. సీఆర్‌డీఏ కార్యాలయం ప్రస్తుతం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో, ఏడీసీ కార్యాలయం కేదారేశ్వర రావుపేటలో ఉన్నాయి. ఈ రెండు ముఖ్య కార్యాలయాలను అమరావతిలో నిర్మిస్తున్న ఈ భవన ప్రాంగణంలోకి శాశ్వత ప్రాతిపదికన తరలించనున్నారు. రెండు ప్రధాన కార్యాలయాలు ఒకేచోట ఉండటం వల్ల పరస్పర అవగాహనతో పాటు మంచి పాలనా సౌలభ్యం కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది.

నిర్మాణం ఇలా..

3.41 ఎకరాలు కేటాయించగా 1.10 ఎకరాల్లో భవనాన్ని జీ+7 రూపంలో ప్రీ కాస్ట్ విధానంలో నిర్మిస్తున్నారు. భవనం పోను మిగిలిన స్థలాన్ని ఉద్యానవనాలు, పార్కింగ్ కోసం వినియోగించేలా ప్లాన్ చేశారు. ఒక్కొక్క ఫ్లోర్‌ను 30,500 చదరపు గజాల విస్తీర్ణం (మిగతా 8వ పేజీలో)

జనం మెచ్చిన డిజైన్‌తోనే..

సీఆర్‌డీఏ కార్యాలయ భవనానికి ఔట్‌పుట్ డిజైన్‌కోసం పది రకాల డిజైన్లను రూపొందించారు. వీటిలో ఏదీ బెస్ట్ అంటూ పబ్లిక్ డొమైన్‌లో ఉంచగా ఎక్కువమంది పదో రకం వైపు మొగ్గు చూపారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు ఆ డిజైన్‌ను ఖరారు చేసి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఒకటి, రెండు ఫ్లోర్లకు సంబంధించి గ్లాస్‌వర్క్ చేస్తున్నారు. భవనానికి నాలుగువైపులా ఈ గ్లాస్ వర్క్ పూర్తయిన తర్వాత భవనానికి ప్రధాన ఔట్‌లుక్‌గా ఉన్న తూర్పువైపున పదో రకం మోడల్ డిజైన్‌ను దాని మధ్యలో అమరావతికి చిహ్నంగా ఇంగ్లీషు అక్షరం ఏ ప్రతిబింబించేలా ఎలివేట్ చేస్తారు.



ఆరోగ్య శాఖలో అవినీతి కంపు

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారి లీలలు
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ కి ఫిర్యాదు చేసిన యూనియన్ నేతలు

6

మండల పరిషత్ నిధుల పెంపు

- 15 శాతం నుంచి 20 శాతానికిపెంపు
- జీవో 25 విడుదల చేసిన పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి

రైళ్ల సమయ పాలనలో నెంబర్ 10

8



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

పోలింగ్ కేంద్రాలను విభజించాలి

- 1200 మందికి మించి ఓటర్లు ఉండరాదు
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల విభజనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పోలింగ్ కేంద్రాల విభజనపై రాజకీయపార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 1200 మందికి మించి ఓటర్లు ఉండరాదనే నిబంధనలను ఉల్లంఘించరాదని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200కు పైగా ఓటర్లు ఉంటే మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల విభజనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 12,91,415 మంది ఓటర్లకు 1510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1100 ఓటర్లలోపు ఉన్న పోలింగ్ కేంద్రాలు 1270, 1101 ఓటర్లకు మించిన పోలింగ్ కేంద్రాలు 250 ఉన్నట్లు గుర్తించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు నాటికి ఓటర్లు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున వెయ్యికి మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే ఓటర్లకు పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్లకు మించి దూరం ఉండరాదన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి..

ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఓటు హక్కు కొరకు జనవరి నుంచి ఇప్పటి వరకు 2,399 దరఖాస్తులు రాగా 382 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో 319 మంది విదేశాలలో ఉంటున్నారని, వీఐపీ ఓటర్లు 2,187 మంది, 14,551 మంది దివ్యాంగ ఓటర్లు, 4,532 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఆధార్ అనుసంధానంలో 1.92 లక్షల ఓట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్.షఫి తదితరులు పాల్గొన్నారు.

మత్తులో యువత



జమ్ములపాలెం ఆర్‌వోబీ మెట్లపై మత్తు ఇంజక్షన్లు చేసుకుంటున్న యువత

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ నుంచి సర్వీస్ రోడ్డుపైకొచ్చే మెట్లపై కొందరు మత్తులో ఊగుతూ కనిపిస్తున్నారు. మంగళవారం రాత్రి కొంత మంది యువకులు మెట్లపై కూర్చొని ఇంజక్షన్లు చేసుకుంటున్న వ్యవహారం వెలుగుచూసింది. యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో పట్టణంలో కలకలం రేగింది. ఇటీవల వెదుళ్లపల్లి వృక్షనగర్‌లో మత్తు బిళ్లలు విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ శాఖ అరెస్టు చేసిన రెండురోజులకే ఆర్‌వోబీ మెట్లపై యువకులు మత్తు ఇంజక్షన్లు చేసుకుంటూ దర్శనమిచ్చారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు.

నాడు బారాబందీ నేడు వారబందీ



నెమలిపురి ప్రాంతంలో కంకి దశలో ఉన్నవరి పొలం

నీటి అవసరంపై నివేదిక

కొన్ని ప్రాంతాల్లో వరి కంకి దశలో ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో పొట్ట దశలో ఉండగా మరి కొన్ని ప్రాంతాల్లో ఆ దశలో కూడా లేదు. కొన్ని ప్రాంతాలకు 10 వరకు.. మరి కొన్ని ప్రాంతాల్లో 15 వరకు నీరు అవసరం ఉందని ప్రాంతాల వారీగా నీటి అవసరంపై జలవనరుల శాఖకు నివేదిక అందించాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల వివరాలను కూడా తెలియజేశాం.

- ఐ మురళీ, వ్యవసాయ శాఖ జేడీ

- నెల క్రితం విచ్చలవిడిగా నీటి విడుదల
- వాగుల్లోనూ వృథాగా పోయిన వైనం
- రైతులకు అవసర సమయంలో నిలిపివేత
- కుడి కాల్వకు 31 వరకే నీటి సరఫరా అంటూ ప్రకటన
- వచ్చే నెల 15 వరకు ఇస్తేనే పంట చేతికి అంటోన్న రైతులు
- ఇప్పటికే 7 వేల క్యూసెక్కులకు తగ్గిన నీటి విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల అవసరానికి మించి కుడి కాల్వ ద్వారా ఇంతకాలం సాగు నీటిని విడుదల చేశారు. పంటలకు ఊపిరిపోయాల్సిన నీరంతా వృథాగా కాల్వల్లో పారింది. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయంలో నీటి విడుదలకు జలవనరుల శాఖ కట్టడి చర్యలు చేపట్టింది. నాడు నీరు వృథాగా పోతున్నా పట్టించుకోని అధికారులు ఇప్పుడు పంటలకు అవసరమైన సమయంలో వారబందీ అమలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాల్వకు విడుదల చేసే నీటిని మంగళవారం 7 వేల క్యూసెక్కులకు తగ్గించారు. బుధవారం నుంచి ఇంకా తగ్గించనున్నారు. ఈ నెల 31న పూర్తిగా నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. సాగునీరు ఈ నెలాఖరు వరకే అనడంతో ఆయకట్టులో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. వివిధ దశల్లో ఉన్న వరికి సాగు నీరు అందకపోతే పంట చేతికి వచ్చేనా అన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. కనీసం వచ్చే నెల 10 నుంచి 15వ తేదీ వరకైనా సాగు నీరు ఇస్తేనే పంట చేతికి వస్తుందని లేకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల 15 వరకు సాగునీరు అవసరం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల వివరాలను జలవనరుల శాఖకు పంపింది. అయితే నెలాఖరు వరకే సాగు నీటి సరఫరా ఉంటుందని జలవనరులశాఖ అధికారులు ప్రకటించారు. ఇదే జరిగితే వేలాది మంది రైతులు పంట కోల్పోయి దారుణంగా నష్టపోయే అవకాశం ఉంది. అయితే ఒక్క ఎకరంలో కూడా పంట ఎండిపోవడానికి వీలు లేదని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ ప్రకటన అమలు కావాలంటే వచ్చే నెల 15 వరకు సాగునీటి సరఫరా చేయాల్సిందే. నీటి విడుదల కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీరివ్వకుంటే నష్టం

నీరు ఫలానా తేదీ వరకే అని ముందే చెబితే సాగుపై ఆలోచించే వాళ్లం.. తీరా వరి సాగు చేపట్టిన తర్వాత నీటి విడుదల చేయమని చెప్తే ఎలా అని రైతులు చెప్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ముందస్తుగా మార్చి 31 వరకే సాగు నీరు అని ప్రకటించి ఉంటే రైతులు సాగు విషయంలో ఆలోచన చేసి ఉండేవారు. ఖరీఫ్‌లో ముందస్తుగా కోతలు పూర్తయిన చేలల్లోనే వరి సాగు చేసుకుని ఉండేవారు. అలా కాకుండా నీటి సరఫరాపై నాడు ప్రకటన చేయకుండా నేడు 31 వరకే అని జలవనరుల శాఖ నిర్ణయించడాన్ని రైతులు తప్పు పడుతున్నారు. ఆయకట్టు పరిధిలో 52,818 ఎకరాల్లో రెండో పంటగా వరి సాగు చేశారు. నకరికల్లు.. రాజుపాలెం మండలాల్లో కంకి.. పొట్ట దశలో ఉంది. మిగతా ప్రాంతాల్లో పంట పొట్ట దశకు కూడా చేరుకోలేదు. కంకి వెళుతున్న సమయంలో నీటి సరఫరా నిలిచిపోతుండటంతో గింజ తాలుగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మిరప పంటకు ఒక తడికి నీరు అవసరం ఉందని రైతులు తెలిపారు.

ముందుగానే తెలియజేశాం

కేఆర్ఎంబీ కుడి కాల్వకు ఇటీవల చేసిన నీటి కేటాయింపుల మేరకు 31 వరకే సాగు నీటి సరఫరా ఉంటుంది. మార్చి 31 వరకే నీటి సరఫరా ఉంటుందని ముందుగానే రైతులకు తెలియజేశాం. నీటి సరఫరా కొనసాగించే అవకాశం లేదు. రైతులు పొదుపుగా నీటిని వినియోగించుకుని సహకరించాలి.

- కృష్ణమోహన్, జలవనరుల శాఖ ఎస్ఈ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (బుధవారం సాయంత్రం)
సహరి : 4.56 (గురువారం ఉదయం)

వాట్సాప్ పాలనతో కొత్త సంస్కరణలకు నాంది

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసు కొచ్చిన వాట్సాప్ పాలనతో కొత్తసంస్కరణలకు నాంది పలికిందని, వాట్సాప్ ద్వారానే 400 సేవలు అందించడంతో దేశంలోనే ఆంధ్రప్ర దేశ్ ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. బడ్జె ట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ మనమి త్ర ద్వారా ప్రజలకు మంచి మిత్రుడిగా సేవలు అంది స్తున్నందుకు మంత్రి లోకేశ్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తక్కువ చదివిన వారు కూడా ఈజీగా ఆపరేట్ చేసుకునేలా ఈ సేవలు ఉండటం అభినందనీయమన్నారు. ఇది తప్పనిసరిగా కోట్లమంది ప్రజలకు ఉపయోగపడుతుందని, పారదర్శకత, సుపరిపాలన, అవినీతి నియంత్రణలో ఎంతో మేలు చేస్తుందన్నారు. అధికా రుల్లో జవాబు దారీతనం పెరుగుతుందని, ప్రజలకు వేగంగా సేవలు అందు తాయని, దరఖాస్తు నుంచి పరిష్కారం వరకు అన్నీ నిర్ణీత సమయంలో పూర్తవుతాయని ఈ సందర్భంగా జీవీ తెలిపారు.

మండల పరిషత్ నిధుల పెంపు

- **15 శాతం నుంచి 20 శాతానికి పెంపు**
- **జీవో 25 విడుదల చేసిన పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి**



గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్తుల పంట పండింది. ఇప్పటి వరకు కేటాయిస్తున్న నిధుల శాతాన్ని కూటమి ప్రభుత్వం ఆసాంతం పెంచేసింది. ఇప్పటివరకు మండల పరిషత్తులకు మొత్తం నిధుల్లో 15 శాతం మాత్రమే కేటాయించే వారు. గ్రామ పంచాయతీలకు 70 శాతం, జిల్లా పరిషత్‌లకు 15 శాతం నిధులను కేటాయించే వారు. అయితే జిల్లా పరిషత్‌లకు కేటాయించే 15 శాతంలో 5 శాతం కోత పెట్టి, మండల పరిషత్తుల వాటాను 20 శాతానికి పెంచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దానివల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల పరిషత్తు లకు ఎనలేని ప్రయోజనం చేకూరనుంది. ఈ నిర్ణయం వల్ల మండల పరిషత్‌లు ఆర్థికంగా బలోపేతం కావటంతో పాటు, మండల స్థాయిలో అభివృద్ధి పరుగులు పెడుతుంది.

ఆరోగ్య శాఖలో అవినీతి కంపు



గుంటూరులోని వైద్య, ఆరోగ్యశాఖ ఆర్‌డీ కార్యాలయం

- నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారి లీలలు
- స్పెషల్ చీఫ్ సెక్రటరికి ఫిర్యాదు చేసిన యూనియన్ నేతలు

గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా ఆరోగ్యశాఖలోని లంచావతారుల లీలలు మాత్రం ఆగలేదు. గుంటూరులోని ఆరోగ్య శాఖ ఆర్డీ (రీజనల్ డైరెక్టర్)కార్యాలయంలో అవినీతి ఏరులై పారుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లా వైసీపీ నేతలను అడ్డంపెట్టుకుని పెట్రేగిపోయిన అధికారులు ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. అందిన కాడికి పుచ్చుకొని అడిగిన చోటికి బదిలీ చేసేందుకు చివరకు జీఓలను కూడా పూర్తిగా పక్కన పెట్టేస్తున్నట్లు తెలుస్తుంది. కార్యాలయంలోని ముఖ్య అధికారిణి సైతం ఈ విషయాల్లో పక్కదారి పట్టించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీకి పూర్తి అనుకూలంగా ఉన్న అధికారి ఆర్డీ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల యూనియన్ నేతలు స్పెషల్ చీఫ్ సెక్రటరిని కలిసి ఫిర్యాదు చేశారు. సదరు అధికారి చేసిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలను అందజేశారు.

- వేమలూరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్‌లను (మగ) నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడం జరిగింది.
- ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్‌ను జీవోకు విరుద్ధంగా పునర్విభజన పేరుతో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు బదిలీ చేయడం జరిగింది.
- కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియార్టీ జాబితా ఉన్న ఖాళీలు ముందుగానే ప్రకటించవలసినది. కానీ వాటన్నిటిని గోప్యంగా ఉంచి ఉద్యోగులను బలవంతంగా వివిధ ప్రాంతాలకు బదిలీ చేయటం జరుగుతుంది. ఆ తర్వాత ఉద్యోగులను వారికి అనుకూలమైన ప్రదేశంలో బదిలీ చేసేందుకు ముడుపులు చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు ఒక హెల్త్ విజిటర్‌ను సుదూర ప్రాంతానికి బదిలీ చేశారు. ఆమెకు రాపూర్‌లో తిరిగి పోస్టింగ్ ఇచ్చేందుకు ఎక్కువ మొత్తంలో నగదు తీసుకున్నారు. మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఈఓ బదిలీ విషయంలో కూడా అదే రీతిగా చేశారని ఆరోపించారు.
- జీవో నెంబర్ 32 ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పునర్విభజన జరగాల్సింది. దానికి విరుద్ధంగా పునర్విభజన ప్రక్రియ చేపట్టారు. ఒక ఎంపీహెచ్‌ఈఓను గురజాల నుంచి సత్తెనపల్లికి నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని వారు ఆరోపించారు.
- జీవో నెంబర్ 143 ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరి కన్నా ఎక్కువ సంఖ్యలో సంబంధిత క్యాడర్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రమే సిబ్బంది లేని ప్రాంతానికి బదిలీ చేయాల్సి ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సింగిల్ కేడర్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లను లక్షల రూపాయలు పుచ్చుకుని వేరే చోటికి బదిలీ చేయటం జరిగిందని ఆరోపించారు.
- జీవో నెంబర్ 32 ప్రకారం సీహెచ్‌వో, ఎంపీహెచ్‌ఈవోల కౌన్సెలింగ్ లో 3:1 నిష్పత్తిని పాటించాల్సింది. అందుకు విరుద్ధంగా కౌన్సిలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేశారు.
- రీ- డిప్లెయిమెంట్ పేరుతో దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ధూపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయిన ఉద్యోగిని, మనుగడలో లేని నిడుముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన మరో హెల్త్ ఎడ్యుకేటర్‌ను ఇంకా ప్రారంభం కాని గుంటూరు జిల్లా మందడం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.
- డిప్యుటేషన్‌లు రద్దు చేయమని స్పెషల్ చీఫ్ సెక్రటరి ఇచ్చిన ఉత్తర్వులను రీజనల్ డైరెక్టర్ కార్యాలయం లెక్క చేయలేదు.ఫిబ్రవరి నెలలో నెల్లూరు జిల్లా నుంచి హెల్త్ సూపర్‌వైజర్‌ను సంతమాగులూరుకు డిప్యుటేషన్ వేశారు. ఒంగోలు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్‌ను పల్నాడు జిల్లా దాచేపల్లికి డిప్యుటేషన్ వేశారు. నెల్లూరు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్‌ను పల్నాడు జిల్లా కోటప్పకొండ ప్రాథమిక కేంద్రానికి డిప్యుటేషన్ వేశారు.
- పబ్లిక్ హెల్త్ నర్స్ పదోన్నతుల్లో కూడా చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు జిల్లా గవర్నమెంట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న హెడ్ నర్సుకు సుప్రీంకోర్టు ఉత్తర్వులను కాదని నోషనల్ సీనియార్టీని జారీ చేశారని వారు ఆరోపించారు. తుళ్లూరులో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ కోసం లేని ఆర్‌ఓఆర్ పాయింట్‌ను సృష్టించి పదోన్నతి కల్పిం చేందుకు రంగం సిద్ధం చేశారని సమాచారం.

ఉచిత విద్యుత్‌తో చేనేత కుటుంబాలకు ఊరట

- హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య
- చేనేతకు ఉచిత విద్యుత్‌పై సర్వత్రా హర్షం



చేనేత కార్మికులకు మిఠాయిలు పంచుతున్న నందం అబద్దయ్య, ధనుంజయరావు తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల నివాసాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేత కుటుంబాలకు ఆర్థికంగా ఊరట కలుగుతుందని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. చేనేత కార్మికులకు, పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల చేనేత వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. మంగళగిరి పట్టణంలోని 19, 20, 21, 22, 24, 26 వార్డుల్లో మంగళవారం సంబరాలు నిర్వహించారు. మగ్గాల షెడ్లలో కేకు కట్ చేసి చేనేత కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అబద్దయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 93 వేల మంది చేనేత కార్మికుల గృహాలు, 10,534 పవర్‌లూమ్ యూనిట్లకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. తొలినుంచి టీడీపీ ప్రభుత్వం చేనేతలకు అండగా నిలుస్తుందని, గతంలో నూలు, రంగులపై సబ్సిడీ, చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25 కోట్లు, మూలధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు 50 శాతం రాయితీకి రూ.80 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు రూ.2 వేల చొప్పున 1.11 లక్షల మందికి పింఛన్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం చేనేతలకు మేలు చేస్తుందన్నారు. మంత్రి నారా లోకేశ్ సారధ్యంలో చేనేత రంగానికి పూర్వవైభవం రాబోతుందని చెప్పారు. 2024 నుంచి రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎన్టీఆర్ పింఛన్ల భరోసా పథకం, త్రిఫ్ట్ ఫండ్, క్లస్టర్ల అభివృద్ధి, ముడి పదార్థాల సరఫరా, చేనేత మార్కెటింగ్ వంటి అంశాలపై దృష్టి సారించిందని తెలిపారు. ఎన్నికల ముందు చేనేతలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం పట్ల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు జంజనం వెంకట సుబ్బారావు, కందుల నాగార్జున, కారంపూడి అంకమ్మరావు, వింజమూరి ఆషాబాల, పడవల మహేష్, దామర్ల బిక్షారావు, ఒడిశా నరేష్, జంజనం శ్రీనివాసరావు, నందం బాబూరావు, వంగర రమేష్, కాశిన కొండలు, బలభద్ర రమేష్, వూట్ల శ్రీమన్నారాయణ, వుద్దంటి గాంధీ, గంజి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రెండు రామమందిరాల వద్ద చేనేత మగ్గాల షెడ్డు వద్ద టీడీపీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, వంగర లక్ష్మయ్య, రుద్ర మురళి, తన్నీరు కృష్ణ, గోసాల రాఘవ, కొల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు ఉపాధి కల్పించాలి

సిమెంటు కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, మార్చి,18 (ఆంధ్రజ్యోతి). సిమెంటు కంపెనీలకు పొలాలు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాల కల్పనలో భాగంగా ఒకరికి ఉపాధి కల్పించండని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సిమెంటు కంపెనీల ప్రతినిధులకు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార హాలులో కలెక్టర్ పొలాలు ఇచ్చిన రైతులు, భవ్య, చెట్టినాడ్ సిమెంటు కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాలు గ్రామస్తుల అవసరాలను గుర్తించి సి.యస్.ఆర్ నిధులు వినియోగించాలన్నారు. జిల్లా అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటు అవసరమన్నారు. భవ్య, చెట్టినాడ్ సిమెంటు పరిశ్రమలు ఉన్న తంగెడ, పెదగార్లపాడు గ్రామాలలో పొలాలు ఉన్న రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తుల తరపున జానీ భాషా, సి.వి.రావులు లేవనెత్తిన పలు అంశాలపై సంబంధిత శాఖలతో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, క్షేత్రస్థాయిలో కమిటీ పర్యటించి పది రోజులలో నివేదికను అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంపెనీల యాజమాన్యాలు అధికారులకు సహకరించాలని చెప్పారు. మెడికల్ క్యాంపులను నిర్వహించాలని, ఆయా ప్రాంతాలలో పండించే పంటలపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుడూ లా అండ్ ఆర్డర్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. గ్రామస్థులలో నమ్మకం ఏర్పడేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, రెవెన్యూ అధికారి మురళి, గురజాల ఆర్డీవో మురళి, జిల్లా పరిశ్రమల అధికారి రవీంద్ర, పొల్యూషన్ కంట్రోల్ అధికారి నజీన బేగం, డీపీవో భాస్కరరెడ్డి, హార్టీకల్చర్ అధికారి రమణారెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం
- బాలిక కుటుంబసభ్యుల దాడిలో నిందితుడికి తీవ్రగాయాలు
- అపస్మారక స్థితిలో నిందితుడు.. జీజీహెచ్‌లో చికిత్స

వట్టిచెరుకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు పంచాయతీ పరిధి లోని బాలికపై అత్యాచారం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బాలిక కుటుంబసభ్యులు నిందితుడి గా భావిస్తున్న వ్యక్తిపై దాడి చేయగా తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. నిందితుడైన అదేకాలనీకి చెందిన థామస్ (55) బాలికపై అత్యాచారం చేశాడని సోమవారం సాయంత్రం 7గంటల సమ యంలో వట్టిచెరుకూరు పోలీసులకు బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బాలికపై అత్యాచారం, నిందితుడిపై దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు ఇతర సిబ్బంది అప్రమత్తమై నిందితుడు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ధ్రువీకరించుకున్నారు. ఈనెల 14వ తేదీన ఎవ్వరూ లేని సమయంలో ఇంటి పక్కనే ఉన్న థామస్ అనే 55 సంవత్సరాల వ్యక్తి బాలికపై అత్యాచారం చేశాడు. రెండు రోజులుగా బాలిక అనారోగ్యంతో ఉండటాన్ని కుటుంబసభ్యులు గమనించి ఆ బాలికను అడగ్గా జరిగిన సంఘటనను వివరించింది. దీంతో బాలిక కుటుంబసభ్యులు థామస్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. అతడి కుటుంబసభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన తరువా త బాలిక కుటుంబసభ్యులు అతడిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఈ కేసును దిశ డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతున్నట్టు వట్టిచెరుకూరు పోలీసులు వెల్లడించారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో నిందితుడి పై దాడికి పాల్పడిన బాలిక కుటుంబసభ్యులపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడైన థామస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

22న చలపతి 30ఏళ్ల మహోత్సవం

తాడికొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ 30 ఏళ్ల మహోత్సవం ఈనెల 22వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మోతడక ఇంజనీరింగ్ కళాశాలలో చలపతి మహోత్సవం పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 19, 20, 21, 22 తేదీల్లో సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22న జరిగే చలపతి మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమారియా, ఏపీ మాజీ డీజీపీ ఎం మాలకొండయ్య, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై సుజిత్‌కుమార్, డైరెక్టర్స్ డీ వినయ్‌కుమార్, కే శ్రీనివాసరెడ్డి, జీ సుబ్బారావు, ప్రిన్సిపాల్స్ నాగ శ్రీనివాసరావు, ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చలపతి మహోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు, కళాశాలల అధ్యాపకులు

ఏఎన్‌యూ దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2025 విద్యాసంవత్సరానికి సెమిస్టర్ విధానంలో వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. న్యూఢిల్లీ, యూనివర్సిటీ గ్రాంట్ కమి షన్, డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి కలిగి యూజీ, పీజీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పీజీ ఆర్ట్స్ 11 కోర్సులు, యూజీ ఆర్ట్స్ 9 కోర్సులు, పీజీ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, యూజీ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, లైబ్రరీ ప్రోగ్రామ్స్ 2 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలను ఏఎన్‌యూ దూర విద్య కేంద్రం (www.anucde.info) అధికారిక వెబ్‌సైట్ నుంచి, ఫోన్ నంబర్స్ 98484 77441, 0863-2346323లో సంప్రదించవచ్చని వెంకటేశ్వర్లు తెలిపారు.

గాజుల్లంక ఇసుక రీచ్‌లో మైనింగ్ అధికారుల తనిఖీలు



ఇసుక రీచ్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కొల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గాజుల్లంక ఇసుక రీచ్‌ను మైనింగ్ అధికారులు పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఆగని ఇసుక దందా' శీర్షికపై స్పందించిన బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు ఫణికుమార్ తన సిబ్బందితో కొల్లూరు మండలంలోని గాజుల్లంక ఇసుక రీచ్‌లో జరిగిన తవ్వకాలను పరిశీలించారు. పరిశీలన నిమిత్తం అధికారులు గోప్యత పాటించారు. ఒక యంత్రాన్ని సీజ్ చేసి సంబంధిత వివరాలను అందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఇచ్చారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీకి నివేదిక అందించి వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి షేక్ మహబూబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 5,6,7,8, తరగతులతోపాటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఈనెల 25లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఏ బాలశ్రీ(8712625039), నంది వెలుగు రోడ్డులోని మైనార్టీ బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ జయప్రకాశ్ (8712625038), మైనార్టీ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీ సాంబశివరావు(9652569140)ను సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈ సూచించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 518.80 అడుగులు ఉంది. ఇది 147.09 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

1,33,222 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,28,999 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,222 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,975 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	13800
334	9500	13000	బంగారం	11000	12500
నంబరు. 5	10000	13500	బ్యాడిగి 355	--	--
273	10000	13000	సింజెంటా		
341	10500	14500	బ్యాడిగి 5531	10000	13500
4884	10000	12000	దేవనూరు డీలక్స్	--	--
సూపర్ 10	--	--	ఆర్మూరు	11000	13300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	5000	7500
తేజ	--	--			

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


కారుమూరి హనుమంతరావు కాలనీలో కట్టడాలను పరిశీలిస్తున్న ఆర్‌డీటీపీ ఏడీ బి.సునీత, టీపీఏ పూర్ణచంద్రారెడ్డి, టీపీవో మల్లికార్జునరావు

అక్రమ లేఅవుట్‌లలో నిర్మాణాలకు అనుమతులు

● ఫిర్యాదులపై విచారణ చేపట్టిన ఆర్‌డీటీపీ అధికారులు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని అక్రమ లేఅవుట్‌లలో నిర్మాణాలకు అనుమతులిచ్చారంటూ ఆర్‌డీటీపీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై మంగళవారం ఆర్‌డీటీపీ ఏడీ బి.సునీత, టీపీఏ జె.పూర్ణచంద్రారెడ్డిలు విచ్చేసి విచారణ చేపట్టారు. స్థానిక టీపీవో ఎస్.మల్లిఖార్జునరావుతో కలిసి అనుమతులిచ్చిన ప్రాంతాలను పరిశీలించారు. కారుమూరి హనుమంతరావు కాలనీలో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. సదరు లేఅవుట్‌లో ఇప్పటికే 40 గృహాలు అనుమతులు తీసుకొని నిర్మించారు. అందువల్లే తాను ప్రభుత్వానికి 14 శాతం డబ్బులు కట్టించిన తర్వాత మాత్రమే అనుమతులివ్వటం జరిగిందని టీపీవో మల్లికార్జునరావు తెలిపారు. అదేవిధంగా బేతనీకాలనీ, చాకలిపాలెం, విజయలక్ష్మీపురం, మున్నంవారిపాలెంలో కూడా ఇదేవిధంగా నిర్మాణాలు జరిగాయని ఫిర్యాదు చేయటంతో ఆప్రాంతాలలో కూడా అధికారులు పరిశీలించారు. మొత్తం 9 గృహాలకు అనుమతులివ్వగా అందులో ప్రస్తుతం 4 నిర్మాణాలు పూర్తికాగా మరో 5 నిర్మాణాలు ప్రారంభించలేదు. అన్నింటిని పరిశీలించిన అధికారులు తగిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. అక్రమ వసూళ్ళతో ప్లాన్ ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. కేవలం ఒక ఎల్‌టీపీ ద్వారా మాత్రమే ప్లాన్‌లు అన్నింటికి అనుమతులిచ్చారని దీనిలో పెద్దఎత్తున చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం అనుమతులిచ్చిన ప్లాన్‌లను పరిశీలించి వెళ్ళారు.

సహజ సబ్బుల తయారీతో పెరగనున్న కుటుంబ ఆదాయం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎ.మణి, డాక్టర్ సర్దార్‌బేగ్ తదితరులు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సహజ సబ్బుల తయారీ వల్ల కుటుంబ ఆదాయం పెరుగుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎ.మణి తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో నిర్వహిస్తున్న 4వ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షత వహించారు. అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ మాట్లాడుతూ శరీరానికి సహజంగా తయారు చేసుకునే సబ్బు మాత్రమే మంచిదని చెప్పారు. ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ ఈ.గౌతమి మాట్లాడుతూ ఇప్పటి వరకు 400 మందికి శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. బ్లిస్‌బ్లూమ్ హెర్బల్స్ లక్ష్మీ సోము మాట్లాడుతూ గ్రామప్రజలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇంట్లోనే సబ్బును తయారు చేసుకోవటం వల్ల ఆరోగ్యం, ఆర్థికంగా కూడా ఎంతో ఉపయోగమన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సబ్బుల తయారీ కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసుకోవటానికి బ్యాంక్ నుంచి రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అనంతరం శిక్షణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులతో ఆడుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాన్ని అరికట్టండి

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రైవేట్ యాజమాన్యాన్ని అరికట్టాలని అఖిల భారత రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం రామచంద్రాపురం గ్రామ మత్స్యకారుల పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేకల ప్రసాద్ మాట్లాడుతూ అడవి గ్రామపంచాయతీ రామచంద్రాపురం గ్రామ మత్స్యకారులు సముద్ర భూ సరిహద్దు సమస్య సీఆర్‌జెడ్ నిబంధనలను అమలు చేయాలన్నారు. రామచంద్రాపురం మత్స్యకారులు మేకల రమణయ్య, కుర్రు మీరయ్య, వాయుల రాములు, కొండూరు శ్రీను, పి.పోలయ్య, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు ఎస్‌డి హాఫీజ్ పాల్గొన్నారు.

సంచారజాతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : వీరన్న

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సంచార జాతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సంచార జాతుల సంఘ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీరన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంబీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామన్నారు. సమావేశంలో కత్తుల గోపి, దార్ల సురేష్, చల్లా చిరంజీవి, కత్తుల వెంకటేశ్వర్లు, చల్లా కొండయ్య, కత్తుల కోటయ్య పాల్గొన్నారు.

డ్రైనేజిలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి : కమిషనర్


పూడుకుపోయిన డ్రైనేజిలలో మట్టి తీయిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను క్షేత్ర స్థాయిలో పర్యటించి సిబ్బందికి వివరించారు. ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో రైలుపేట, ధైతావారివీధి, పిల్లలమర్రివారి వీధి తదితర ప్రాంతాలలో డ్రైనేజిలను శుభ్రం చేయించారు. అనంతరం రాజీవ్‌గాంధీకాలనీలోని వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ చికిత్సాలయాన్ని పరిశీలించారు. స్నేయానిమల్ వెల్ఫేర్ సొసైటీ వారికి తగు సూచనలు చేశారు. డంపింగ్ యార్డును పరిశీలించి బయోమైనింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుమందుల పిచికారిలో జాగ్రత్తలు పాటించాలి

● అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూన రాణి


వ్యవసాయ కళాశాలలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల కీటక శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పురుగుమందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మందులు పిచికారి చేసేటప్పుడు తగిన వస్త్రాలను ధరించాలని లేకుంటే విష ప్రభావం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులకు వ్యక్తిగత భద్రత వస్త్రాల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్లేషణ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.ప్రసన్నకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ అబ్దుల్ సలాం, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ కె.సుశీల, మర్రిపూడి, ఇటికంపాడు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలోని జన్యుశాస్త్రం, మొక్కల పెంపకంలో భాగంగా మంగళవారం సేంద్రియ చిరుధాన్యాల సాగు, సస్యరక్షణ, విత్తన ధ్రువీకరణ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి రైతులకు సూచనలు చేశారు. చిరుధాన్యాలు సాగు రైతులకు లాభాలను చేకూరుస్తుందని వివరించారు. వాటివల్ల కలిగే ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో లాల్ అహ్మద్ డాక్టర్ తుషారా రాణి, డాక్టర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం... అధికారుల అలక్ష్యం

● రోడ్లన్నీ గుంతలమయం


పాతబస్టాండ్ దగ్గర భీమావారిపాలెం వెళ్ళే రోడ్డులో, సూర్యలంక రోడ్డులో యూనియన్ బ్యాంక్ ఎదురు తవ్విన గుంతలు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించే సమయంలో తాగునీటి పైపులైన్‌లు కలపకుండా కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యంగా రోడ్లు నిర్మించి బిల్లులు చేసుకొని వెళ్ళిపోయారు. అధికారులు మాత్రం పనులపై అలక్ష్యంగా వ్యవహరించారు. ముందుచూపులేకుండా రోడ్లు పూర్తి చేయటం వల్ల అనేకచోట్ల తాగునీటిపైపులైన్లకు లీక్‌లు ఏర్పడ్డాయి. దీనికితోడు ఇంటర్‌కనెక్షన్‌లు కూడా ఇవ్వకుండా వదిలేశారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ అధికారులు రోడ్లపైకి వచ్చి చూస్తే ఎక్కడ చూచిన పైపులైన్‌లు లీక్‌లు, రోడ్లు చీల్చుకొని నీరు బయటకు రావటం వంటి సమస్యలే కాకుండా ఇంటర్ లింకులు కలపకపోవటం వల్ల కొన్నిప్రాంతాలకు సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల లీక్‌ల్లోకి మట్టి, మురుగువంటివి వెళ్ళి కలుషితనీరు సరఫరా అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో అధికారులు లీక్‌లు ఉన్నచోట్ల రోడ్డుపై గుంతలు తవ్వి మరమ్మతులు చేయటం, ఇంటర్‌లింకులు కలపటం వంటి పనులు చేస్తున్నారు. ప్రస్తుతం గడియారస్తంభం దగ్గర తవ్విన గుంత నెలలు తరబడి అలాగే ఉండిపోయింది. సూర్యలంకరోడ్డులో ఇండియన్ బ్యాంక్ ఎదురు ఆర్‌అండ్‌బి రోడ్డుపై గుంత తవ్వి వదిలేశారు. పాతబస్టాండ్ కూడలిలో భీమావారిపాలెం వెళ్ళే రోడ్డుపై గుంతతవ్వి ఉంచారు. జీబీసీరోడ్డులో దగ్గుమల్లివారిపాలెం వద్ద రోడ్డుపైన తవ్విన గుంత అలాగే ఉండిపోయింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏబీఎమ్ చర్చి దగ్గర పైపులైన్ మరమ్మతుల కోసం రోడ్డును పగలగొట్టి పనులు పూర్తి చేసి మట్టితో పూడ్చారు. దీనివల్ల ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదేవిధంగా కర్లపాలెం రోడ్డులో కూడా రోడ్డు తవ్వి మట్టిపోశారు. రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్‌లు పైపులైన్‌లు గురించి పట్టించుకోవకపోవటం వల్ల సమస్య ఏర్పడింది. అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌లను పిలిపించి మరమ్మతులు చేయించి రోడ్డును ఆధునీకరించి పట్టణ ప్రజలకు, వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. అయితే అధికారులు మాత్రం దీనిపై వారిని పిలిపించిన సందర్భాలు లేవనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు మాత్రం పిలిపించి అడిగితే పనులు పూర్తి చేసి అప్పగించిన తర్వాత మాకు సంబంధంలేదని చేతులు దులుపుకొని వెళుతున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈవిషయమై కమిషనర్ జి.రఘునాథరెడ్డిని వివరణ కోరగా సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం అందించి రోడ్ల మరమ్మతులు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జేసీకి అంగీకార పత్రం అందజేసిన బాపట్ల మిల్లర్స్


నెల్లూరు జేసీకి అంగీకార పత్రం అందజేస్తున్న రత్నగుప్తా, రావి శ్రీనివాసరావు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో వరి దిగుబడులు అధికంగా రావటంతో సీఎంఆర్ చేయటానికి బాపట్ల జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సహకరించాలని అక్కడి జాయింట్ కలెక్టర్ కోరారు. దీనిపై స్పందించిన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బివి.రత్నగుప్తా, ప్రధాన కార్యదర్శి రావి శ్రీనివాసరావులు సభ్యులతో కలిసి వెళ్ళి అంగీకార పత్రాన్ని ఆయనకు అందజేశారు. అక్కడ రైతులకు గిట్టుబాటుధర రావటంలేదని సీఎంఆర్ సౌకర్యం కల్పించాలని పెద్దఎత్తున విజ్ఞప్తులు రావటంతో ఎక్కువ రైస్‌మిల్లులు లేనందున ప్రకాశం, బాపట్ల జిల్లాల రైస్‌మిల్లర్స్ సహకారం కోరారు. దీంతో అంగీకరించిన బాపట్లజిల్లా మిల్లర్స్ మంగళవారం జాయింట్ కలెక్టర్‌ను కలిసి సీఎంఆర్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరి దేవకి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు నీలికట్టు నరసింహారావు, జివి ఆంజనేయులు ఉన్నారు.

ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలి

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్ తెలిపారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థినులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు రీసోర్స్‌పర్సన్‌గా చేసిన డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ లేటెస్ట్ టెక్నాలజి అయిన అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఇనిస్టాలేషన్ అండ్ క్రియేషన్ ఇన్ కుడ్ యూజింగ్ గిట్, జెంటిన్స్ అండ్ డోకర్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఐ.హరిత, విభాగాధిపతి జి.వెంకటేశ్వరి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్.జయశాంతి, ఝాన్సీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలలో 45 శాతం నేరచరితులు : డాక్టర్ సాయిబాబు

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఎమ్మెల్యేలలో 45 శాతం నేరచరితులు ఉన్నారని ఎన్నికల నిఘా వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. ఈవిషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలో 4,100 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. అందులో 29 శాతం మంది తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలలో అత్యధికంగా 79 శాతం మంది నేరచరిత్ర కలిగి ఉన్నారన్నారు. 69 శాతం ఎమ్మెల్యేలతో కేరళ, తెలంగాణ రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయన్నారు. 65 శాతంతో బీహార్ 3వ స్థానంలో ఉందన్నారు. దేశంలోని 28రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలోని అందరు ఎమ్మెల్యేలు ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ఈ విశ్లేషన చేసినట్లు డాక్టర్ సాయిబాబు వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న అందరు ఎమ్మెల్యేల ఆస్తి 73,348 కోట్ల రూపాయలుగా ఉందన్నారు. నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాల ఉమ్మడి బడ్జెట్‌కు ఇది సమానమన్నారు. దేశవ్యాప్తంగా ఎమ్మెల్యే సగటు ఆస్తి 17.92 కోట్ల రూపాయలుగా ఉందన్నారు.

పరిహారం దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ది దగ్గుమల్లివారిపాలెం ఆదిఆంధ్ర కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ భూమికి సంబంధించిన పరిహారం డబ్బులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సొసైటీకి సంబంధించిన 10 ఎకరాల భూమిని జాతీయ రహదారి నిర్మాణం సమయంలో తీసుకోవటం జరిగిందన్నారు. దీనికి సంబంధించి 5కోట్ల రూపాయలు పరిహారంగా సొసైటీ ఖాతాలో వేయటం జరిగిందని తెలిపారు. అయితే బైలా నిబంధనలకు, కోఆపరేటివ్ చట్టానికి వ్యతిరేకంగా సొసైటీ అకౌంట్‌లోని డబ్బులు అక్రమ మార్గంలో కొంతమంది తీయటం జరిగిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సదరు వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాత్ర కూడా ఉన్నట్లు ఆయన ఆరోపించారు. వీరందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

రన్‌ఫర్ జీసస్‌ని జయప్రదం చేయాలి

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా బాపట్లలో చేపట్టే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఫ్‌డబ్ల్యు కోల్ కోరారు. ఈ విషయమై మంగళవారం రోటరీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో జరగబోయే ఈ కార్యక్రమంలో ప్రజలంతా పెద్ద సంఖ్యలో హాజరై దేవుని మహిమ పర్చాలని కోరారు. సమావేశంలో డాక్టర్ కాగిత వరప్రసాదరావు, జిఎ.మణిభూషణ్, జాన్‌వెస్లీ, కాగిత సుందరదాసు, గడ్డం ఏలియా పాల్గొన్నారు.

ప్రముఖ నృత్యకళాకారుడు మృతి

కర్లపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం యం.వి.రాజుపాలేనికి చెందిన ప్రముఖ నృత్యకళాకారుడు పరిశా వెంకటేశ్వర్లు రెడ్డి మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తాగునీటి చెరువు పరిశీలన

కర్లపాలెం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగొల్లపాలెం రక్షిత మంచినీటి చెరువును జడ్పీ సీఈవో జ్యోతిబసు, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ మంజూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఆర్థిక సహాయంతో గృహాలు పూర్తి చేసుకోవాలి

● ఎంపీడీవో సుదీప


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుదీప

చుండూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయంతో నిలిచిన గృహ నిర్మాణ పనులను పూర్తి చేసుకుని సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని ఎంపీడీవో సుదీప కోరారు. మంగళవారం చినపరిమి, పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులతో చినపరిమిలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, చినపరిమిలో 27 ఇళ్లు, పెదగాదెలవర్రులో 11 ఇళ్లు, చినగాదెలవర్రులో 15, కార్మూరువారిపాలెంలో 11 నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు. వీటిని పూర్తి చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేరుగు సుభాషిణి, ఎంపీటీసీ అవుతు శివపార్వతి, అవుతు సాయిబాబురెడ్డి, అయ్యపరెడ్డి, పంచాయితీ కార్యదర్శి విజయబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు


గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచ్ కిరణ్మయి, అధికారులు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మురుగు డ్రైనేజీలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పంచాయితీ అధికారులు సర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డు సమీపంలో మురుగు డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండి నీరు వెళ్లే పరిస్థితి లేదని గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందడంతో సర్పంచ్ కిరణ్మయి డ్రెయిన్‌ను పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో గుర్రపుడెక్క, తూటికాడ వంటి వ్యర్థాలు తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బూరెల రాంప్రసాద్, కోటా శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మంత్రివర్గ తీర్మానంతో నేతన్నల మోముల్లో ఆనందం

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల గృహాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని ఆమోదిస్తూ మంత్రివర్గం తీర్మానం చేయడంతో నేతన్నల మోముల్లో ఆనందం వెల్లివెరిసింది. టీడీపీ సీనియర్ నాయకుడు వంగర వీరయ్య మంగళవారం మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు కేబినెట్ ఆమోద ముద్ర వేయడం హర్షణీయమన్నారు. ఎన్నికల ముందు నేతన్నలకు ఇచ్చిన హామీలను ఈ విధంగా ముఖ్యమంత్రి నెరవేర్చారన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పెసలు, మినుముల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో శ్యాంసన్

చుండూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దళారుల చేతుల్లో రైతాంగం నష్టపోకుండా ఉండటానికి ప్రభుత్వం పెసలు, మినుములు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్యాంసన్ తెలిపారు. మండల కేంద్రం చుండూరులో పెసలు, మినుముల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ద్వారా క్వింటా పెసలు రూ.8682, మినుము రూ.7400 వంతున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీవో తిరుపాల్‌రెడ్డి, ఆడిట్ అధికారి మురళీమోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, సీఈవో అంజిరెడ్డి, గుదేటి ఎల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, మండల అధ్యక్షుడు రూబేన్, సర్పంచ్ శ్రీరామమూర్తి, శ్రీమాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు : ఎంపీడీవో

చెరుకుపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 151 మంది బీసీ, ఓసీల్లో ఈబ్ల్యూఎస్ మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టుశిక్షణతోపాటు మిషన్లను అందించనున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, కమ్మ, కాపు,రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, ఈబీసీ వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి కల్పనకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అప్లికేషన్స్ సచివాలయాలలో వెల్ఫేర్ అసిస్టెంట్స్ వద్ద ఈనెల 22వ తేది వరకు పెట్టుకోవచ్చని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు 45 రోజుల నుంచి 90 రోజుల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరుకలిగి ఉండి టైలరింగ్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత కుట్టుమిషన్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

పేదలకు ఆహార ప్యాకెట్‌లు పంపిణీ

బాపట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డంపింగ్ యార్డు, రాజీవ్‌గృహకల్ప పరిసర ప్రాంతాలలోని నిరుపేద కుటుంబాలకి జేసీఎన్‌ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ, సభ్యులు కలిసి ఆహార ప్యాకెట్‌లు అందజేసి పేదలకు తమవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమోతి, కట్టా విజయరాజు, జయపాల్, దాసరి ఏసుబాబు, కె.సుజాత, కన్నెగంటి సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు

● మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలోని వివిధ పనుల అభివృద్ధి కోసం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ హయాంలో పురపాలకసంఘం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన దాఖలాలు లేవన్నారు. మంత్రి నారాయణకి పురపాలక సంఘ పరిస్థితిని వివరించటంతో తక్షణమే రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 11వ వార్డులోని చంద్రమౌళిపార్కులో గెస్ట్ హౌస్ నిర్మాణం, గ్రంథాలయం భవనానికి, పట్టణంలో 2, 3, 4, 5 వార్డుల్లో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, చంద్రమౌళి పార్కు అభివృద్ధి కోసం ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గ్రంథాలయ నూతన భవనానికి నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. మున్సిపల్ గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరటంతో నూతన మున్సిపల్ గెస్ట్ హౌస్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించామన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత


సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామానికి చెందిన కొత్త వెంకటేశ్వర్లుకు రూ.75 వేలు, ఇంటూరు గ్రామానికి చెందిన సింగమనేని సీతా మహాలక్ష్మీ రూ.85,558, షేక్ జానీసైదులుకి రూ.68,916, మూల్పూరుకు చెందిన తాళ్లూరి శివజానకి రూ.75,090, పెదపూడికి చెందిన షేక్ బాజీకి రూ.55,280 మొత్తం 3 లక్షల 59 వేల 844 రూపాయల చెక్కులు సీఎం సహాయనిధి కార్యాలయం నుంచి విడుదలయ్యాయి. వీటిని లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

శక్తి మొబైల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

● ఎస్పీ తుషార్ డూడి



బాపట్ల,మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : శక్తి మొబైల్ యాప్ గురించి కళాశాలలు, రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌లు, ముఖ్యకూడళ్ళల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ తుషార్ డూడి సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని అనేక ప్రాంతాలలో మంగళవారం శక్తిబృందాలు యాప్ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాలలో యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేస్తే క్షణాలలో పోలీసులు వారు ఉన్న ప్రాంతానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. మహిళలు ఒంటరిగా పనిచేసే సమయంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్‌ను ఆన్‌చేసుకుంటే వారు సురక్షితంగా గమ్యస్థానం చేరుకునే వరకు వారి ప్రయాణంపై పోలీసు నిఘా పెడుతుందన్నారు. ప్రతి మహిళ, విద్యార్థిని స్వచ్ఛందంగా తమ మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా శక్తియాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో 5 శక్తి బృందాలు పర్యటించి అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఎంపీ నిధులతో షాపుల అక్రమ నిర్మాణం

● పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు


ఎంపీ నిధులతో అక్రమంగా కట్టిన షాపులు

రేపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద సిద్ధివిఘ్నేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం కోసం ఎంపీ నిధులు రూ.10 లక్షలు మంజూరుకాగా ఆ నిధులతో నిబంధనలకు విరుద్ధంగా దేవాలయ ప్రాంగణంలో అక్రమంగా షాపుల నిర్మాణం చేశారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలుస్తుంది. దేవదాయ శాఖ అధికారులు కనీసం షాపుల నిర్మాణం జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయంలో ఇష్టానుసారంగా కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ షాపులు నిర్మాణం చేశారని, ఆ దుకాణాలను స్థానిక వైసీపీ నాయకులు సద్వినియోగం చేసేందుకు పోటీపడుతున్నారని, తక్షణమే ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రభుత్వ సొమ్ముతో అక్రమంగా నిర్మించిన దుకాణాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని, దుకాణాలు లేకుండా ఆలయానికి ఉపయోగపడే విధంగా ఆ కట్టడాలను వినియోగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న అనూప్‌కుమార్‌యామా

చెరుకుపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్లో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే వార్షిక క్రీడా సమావేశం మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా 2015 ప్రపంచ స్కేటింగ్ ఛాంపియన్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్‌యామా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవం క్రీడా ఉత్సవం విద్యార్థులకు అథ్లెటిక్స్‌లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక గొప్పవేదికగా నిలవనుందని తెలిపారు. విద్యార్థులకు క్రికెట్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ వంటి క్రీడలతోపాటు కిండర్‌గార్డెన్ తదితర వినోదాత్మక క్రీడలను పెట్టారు. కార్యక్రమంలో చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి, సాయిరంగారెడ్డి, సాయిగణేష్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వందనశర్మ, పీఆర్వో శివప్రసాద్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక

చెరుకుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ప్రముఖ కంపెనీలైన డాక్టర్ బిజినెస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండిషనర్ ప్రతినిధులు హాజరయ్యారు. 51 మంది యువతీ, యువకులు హాజరుకాగా 29 మంది ఈ కంపెనీలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో, జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్, యంగ్ ప్రొఫెషన్ ఈ.హరికసౌగంధి, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.హరీష్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ : ఎంపీడీవో

వేమూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ సబ్సిడీ రుణాలకు ఈనెల 22 లోగా దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. ఆయన మంగళవారం కార్యదర్శుల సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, వెనుకబడిన వారికి రుణాల కింద మండల పరిధిలో పది మందికి అందించడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా రూ.75 వేలు సబ్సిడీ పోను, రూ.1,25,000 బ్యాంకు రుణం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచిత కుట్టుమిషన్లు పంపిణీకి మండల పరిధిలో 56 మందిని ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు.

రైళ్ల సమయపాలనలో నెం 10

- దేశంలోనే గుంటూరు రైల్వే డివిజన్‌కు అరుదైన ఘనత
- ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేసి అభినందించిన కేంద్ర రైల్వే మంత్రి
- దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో టాప్ పొజిషన్

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైళ్ల సమయపాలన విషయంలో గుంటూరు రైల్వే డివిజన్ జాతీయ స్థాయిలోనే గుర్తింపు పొందింది. దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్న డివిజన్లలో 10వ స్థానంలో నిలిచి దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు గర్వకారణంగా నిలిచింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా మంగళవారం తన ట్విట్టర్(ఎక్స్) ఖాతాలో అభినందిస్తూ పోస్టు చేశారు. కాగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఉన్న అన్ని డివిజన్లలో కంటే గుంటూరు అగ్రస్థానంలో నిలవడం మరో విశేషం. దీంతో డివిజన్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో నిత్యం రెగ్యులర్/స్పెషల్ ట్రైన్స్ కలుపుకొని దాదాపుగా 200 వరకు ప్రయాణిస్తున్నాయి. వీటి ల్లో కొన్ని ఇక్కడి నుంచి ప్రయాణం ప్రారంభమయ్యేవి ఉండగా, చాలావరకు ఇతర డివిజన్ల నుంచి వచ్చి వెళుతుంటాయి. గుంటూరు - విజయవాడ, గుం టూరు - తెనాలి మధ్యన డబుల్ ట్రాక్ ఉన్నది. అలానే గుంటూరు నుంచి దిగువమెట్ట వరకు కూడా డబుల్ ట్రాక్ సదుపాయం ఉన్నది. సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు ప్రస్తుతానికి సింగిల్ ట్రాక్ మాత్రమే అందుబాటులో ఉన్నది. దీని వలన కొన్ని రైళ్లను లూప్‌లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి. అలానే గూడ్స్ రైళ్ల ద్వారా ఆదాయం సమకూరుతుంది. దీంతో వాటిని కూడా నిర్ణీత సమయానికి నడపాల్సి ఉన్నది. అయినప్పటికీ 95.7 శాతం సమయపాలన సాధించడం విశేషం.

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో గుంటూరుతో పాటు విజయవాడ, గుంతకల్లు, నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లు ఉన్నాయి. అయినప్పటికీ సమయపాలన విషయంలో అన్నింటిని వెనక్కు నెట్టి గుంటూరు అగ్రస్థానంలో నిలవడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. జోన్‌లో గుంటూరు తర్వాత గుంతకల్లు(94.3), హైదరాబాద్(93.6 శాతం), నాందేడ్(92.5) సమయపాలన సాధించాయి.



గుంటూరు రైల్వే స్టేషన్

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతమున్న సర్వీసులు, భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం సమాలోచనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉచిత ప్రయాణం నేపథ్యంలో అందుకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాలపై ఆర్టీసీ యంత్రాంగం ఫోకస్ పెట్టింది.


గుంటూరులోని ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్

ఉచిత ప్రయాణంపై.. కసరత్తు

- జిల్లా వ్యాప్తంగా లెక్కలు తీస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
- అదనపు బస్సుల అవసరంపై ప్రణాళికలు
- ఓఆర్ మరింత పెరిగే ఛాన్స్

గుంటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్టాండ్‌లలో సదుపాయాలు, సర్వీసులు, రద్దీ రూట్‌లలో ప్రయాణాలు వంటి అంశాలపై ఆర్టీసీ కేంద్ర కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. దాంతో అధికారులు అదనపు సౌకర్యాలు, సర్వీసులపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అద్దెవి కలుపుకొని ఆర్టీసీకి వెయ్యి వరకు సర్వీసులున్నాయి. విభజిత గుంటూరు జిల్లాలో గుంటూరు -1,2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలున్నాయి. అలానే పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల డిపోలుండగా, బాపట్ల జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి డిపోలున్నాయి. అయితే మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వివరాలు తీస్తున్నారు.

ఓఆర్ మరింత పెరిగే ఛాన్స్

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) మరింత పెరగనున్నట్లు అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓఆర్ 70 శాతం వరకు ఉంటుందని సమాచారం. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి తీసుకొస్తే ఈ రేషియో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంఖ్య మరిన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు మహిళల రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన అదనపు సర్వీసులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ (ఈడీ) నాగేంద్రప్రసాద్‌తో పాటు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) ఎమ్ రవికాంత్‌లు ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

పీఎం యోగ అవార్డులు-2025

- దరఖాస్తు ప్రక్రియ షురూ
- నెలాఖరు వరకే ఛాన్స్
- నాలుగు కేటగిరీల్లో అవార్డులు

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 2025 ప్రధానమంత్రి యోగా అవార్డుల కోసం కేంద్ర ఆయుష్ శాఖ దరఖాస్తుల స్వీకార ప్రక్రియని ప్రారంభించింది. యోగాని అభివృద్ధి, ప్రమోట్ చేస్తూ సమాజంపై కీలకంగా ప్రభావం చూపుతున్న వ్యక్తులు/సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేయనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డులను ప్రకటిస్తుంది. జాతీయ వ్యక్తిగత, అంతర్జాతీయ వ్యక్తిగత, జాతీయ సంస్థ, అంతర్జాతీయ సంస్థ కేటగిరీల్లో నాలుగు అవార్డులు ఇస్తుంది. ఒక్కో అవార్డుకు నగదు బహుమానాన్ని రూ. 25 లక్షలుగా నిర్ణయించడంతో ఏటా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూడా యోగా గురువులు, సంస్థలు దరఖాస్తు చేసు కుంటున్నాయి. ఈ నెల 31వ తేదీతో దరఖాస్తు చేసుకో వడానికి గడువు ముగియనున్నందున ఉమ్మడి గుం టూరు జిల్లా స్టెప్ సీఈవో ఆర్ చంద్రముని సూచించారు.

వ్యాధి నిరోధకత, ఆరోగ్యోన్నతి, జీవనశైలి రుగ్మతలకు అడ్డుకట్ట వేసే గొప్ప సాధనంగా యోగాకు పేరున్నది. 2014 డిసెంబరు 11వ తేదీన వచ్చిన అంతర్జాతీయ విజ్ఞప్తి మేరకు యూఎన్ జనరల్ అసెంబ్లీ ఏటా జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగ దినోత్సవంగా జరుపుకునేలా తీర్మానం చేసింది. అది మొదలుకొని ఏటా ఇక్కడ నిర్ణీత తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నారు. యోగ సాధకులే కాకుండా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎన్‌సీసీ క్యాడెట్‌లు భాగస్వామ్యం అవుతూ మరింత ప్రాముఖ్యాన్ని తీసుకొస్తున్నారు. కాగా యోగాని మరింతగా ప్రమోట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా నాలుగు కేటగిరీల్లో అవార్డులను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నది. 40 సంవత్సరాల వయస్సు, యోగా ప్రచారం, అభివృద్ధిలో అద్భుతమైన ట్రాక్ రికార్డు, కనీసం 20 ఏళ్లుగా సేవ చేస్తున్నట్లు అయితే ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

అవార్డుల కోసం ఒక వెబ్‌సైట్‌ని కూడా కేంద్ర ఆయుష్ శాఖ ప్రారంభించింది. ఇన్నోవేటివ్ ఇండియా.మైజీవోవీ.ఐఎన్/ పీఎం-యోగా-అవార్డ్స్-2025/అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు అవకాశం కల్పించింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకార ప్రక్రియ ప్రారంభం కాగా నెలాఖరుతో గడువు ముగిసిపోతుంది. అవార్డులకు ఎంపికైన వాళ్ల, సంస్థల పేర్లను యోగా దినోత్సవం రోజున కేంద్రం ప్రకటిస్తుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అనేక యోగా సంస్థలు ఉన్న దృష్ట్యా వారంతా దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈవో విజ్ఞప్తి చేశారు.



23న ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష

పెదకాకాని, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్టు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంక



టేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయని అభ్యర్థులు నేరుగా పదో తరగతి, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా, ఫొటోతో పాటు సాధారణ ఫీజు రూ.500 చెల్లించి, పరీక్షకు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 25వ తేదీ సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు. కాగా.. ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చు.

నల్లపాడు జీడీసీసీ అధికారుల సస్పెన్షన్ ?

- ◆ చర్యలకు సిద్ధమయిన అధికారులు
- ◆ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించడంతో కదలిక

గుంటూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు జీడీసీసీ బ్యాంకును అక్రమాలకు అడ్డాగా మార్చిన అధికారులను సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధమైంది. జీడీసీసీ బ్యాంకు కు చెందిన మేనేజర్లు, సూపర్వైజర్లు,నోడల్ అధికారులపై వేటు పడనున్నట్లు తెలుస్తుంది.నల్లపాడు జీడీసీసీ బ్యాంకు లో రూ.5 కోట్ల అక్రమాలు జరిగిన విషయాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులు సోమవారం అసెంబ్లీ లో ప్రస్తావించారు. నకిలీ రుణాలు పొందేందుకు సహకరించిన వారిపై ఏ విధమైన చర్యలు తీసుకోలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దానిపై స్పందించిన ప్రభుత్వం జీడీసీసీ అధికారులపై వేటు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక మహిళా అధికారిని కూడా సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం అందింది.

సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట - రావికంపాడు మధ్యన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి, 24, 25 తేదీల్లో విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి, 24న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రెండు వైపులా రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అలుమ్నికి.. ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

మూటగట్టుకుంటోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను ఐదు సంకలనాలుగా పుస్తకాల రూపంలో తీసుకొస్తే వాటిని భావితరాలకు అందించడంలోనూ వర్సిటీ నిర్లక్ష్యంపై అలుమ్ని తప్పుబడుతోంది.

పరిగణనలోకి తీసుకోని వర్సిటీ

ఏజీ కళాశాలలో వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. పోతన వసతి గృహం మూతపడగా, వేమన, సిద్ధార్థ హాస్టల్ భవనాలు పెచ్చులూడుతూ విద్యార్థులను భయపెడుతున్నాయి. ఆ ఫొటోలను ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ఖాతాకు ట్యాగ్ చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనాల నిర్మాణానికి వర్సిటీ నుంచి నిధుల మంజూరు అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పూర్వ విద్యార్థుల్లో కొందరు నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వారిని యూనివర్సిటీ పెద్దలు అసలు పరిగణనలోకి తీసుకోవడంలేదని సమాచారం. సేద్యంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్లు బోధనా పద్ధతులలో కూడా మార్పు రావాల్సి ఉంది. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు మొదలుకుని ల్యాబ్స్ వరకు అన్ని వర్సిటీనే భరించాలంటే నిధుల కొరత ప్రతిబంధకంగా ఉంది. ఈ పరిస్థితుల్లో నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చే పూర్వ విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా యూనివర్సిటీ ఆలోచన చేయాల్సి ఉంది. వర్సిటీ పెద్దలు చొరవ తీసుకుని అలుమ్నితో సమావేశమై వారి వైపు నుంచి అందాల్సిన సహకారంపై స్పష్టత ఇవ్వగలిగితే భారీ విరాళాలు వచ్చే అవకాశం ఉంది.

సిద్ధమౌతున్న సీఆర్‌డీఏ భవనం

(5వ పేజీ తరువాయి)

వచ్చేలా భవనాన్ని 2 లక్షల 43వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందిస్తున్నారు. ఈ భవనం గ్రౌండ ఫ్లోర్‌లో ఎంట్రన్స్ లాబీతోపాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, కిచెన్, సర్వర్ రూమ్స్, బ్యాంకు, ఏటీఎం తదితరాలను ఏర్పాటు చేస్తున్నారు. వెనుక భాగంలో ఫైర్ సేఫ్టీ భవనం, పవర్‌హౌస్‌ను నిర్మించనున్నారు. మూడు ఫ్లోర్లను సీఆర్‌డీఏకేటాయించనుండగా తొలి అంతస్తులో ఐదు సెమినార్ హాల్స్, రిసెప్షన్ ఏరియా, రిజిస్ట్రేషన్ చాంబర్, లంచ్ హాలు ఉంటాయి. 240 సీటింగ్ సామర్థ్యంతో ఏవీ సెమినార్ హాలు సౌండ ప్రూఫ్, ఉడెన్ కార్పెట్ ఫ్లోరింగ్ తో నిర్మిస్తున్నారు. సెకండ్ ఫ్లోర్‌లో కార్యాలయ సిబ్బంది క్యాబిన్లు, ఓపెన్ వర్క్ స్టేషన్లు, అడిషనల్ కమిషనరు చాంబర్లు, ఐటీ హబ్, ప్రింటర్ చాంబర్లు ఉంటాయి. మూడో అంతస్తులో కమిషనరు చాంబర్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిబ్బంది ఓపెన్ వర్క్ స్టేషన్లు ఉంటాయి. తర్వాతి రెండు ఫ్లోర్లను ఏడీసీ(అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్యాలయానికి కేటాయించారు. కార్యాలయాల కోసం వినియోగిస్తారు. ఆరు, ఏడు ఫ్లోర్లను ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇవ్వనున్నారు. ఇక ఈ భవనానికి తూర్పు వైపున మూడు, ఉత్తరం వైపున రెండు, పడమర వైపున రెండు లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు.

పనులతో మళ్లీ కళకళ

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా అమరావతిపై కక్ష కట్టి ఎక్కడికక్కడ పనులు నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావడంతో అమరావతిలో మళ్లీ రాజధాని కళ కనిపించడం మొదలైంది. ఈ క్రమంలోనే దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో పనులను పునఃప్రారంభించేందుకు అధికార యంత్రాంగాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు సన్నద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చీ రావడంతోనే జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గతేడాది అక్టోబరు 19న సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవన పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు సివిల్ పనులు పూర్తి చేశారు. తొలి నాలుగు అంతస్తులలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. ఇంటీరియర్ వర్కులను కూడా సమాంతరంగా చేపట్టారు. ఇంటీరియర్‌లో ఆర్కిటెక్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.


2024 అక్టోబరు 16న పూజచేసి భవన పునఃనిర్మాణ పనులను ఆరంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

నిబంధనలు కచ్చితంగా అమలుచేస్తున్నాం

- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు
- సీఆర్‌డీఏ అధికారులతో సమావేశమైన ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేం దుకు నిర్దేశించిన కార్యక్రమాల అమలు అలాగే ప్రాజెక్టులో భాగంగా తొలి ఏడాది యాక్షన్ ప్లాన్‌పై చర్చల నిమిత్తం ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులు సీఆర్‌డీఏ కార్యాలయంలోని ఆడిటోరియంలో మంగళవారం సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో సమావేశమయ్యారు. సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, మల్లారపు నవీన్‌తో పాటు సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు రాజధాని అమరావతిలో చేపట్టిన పనుల ను గత ఏడాదిలో ఆయా పనులలో సాధించిన పురోగతిని వివరించారు. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులో కీలకమైన అంశాలకు సంబంధించిన డిస్బర్స్ మెంట్, కార్యక్రమం అమలులో పాటి స్తున్న కార్యకలాపాలను అధికారులు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందానికి వివరించారు.

కమిషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ నిధుల మంజూరుకు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్దేశించిన నిబంధనలను రాజధాని అమరావతి నిర్మాణంలోనూ, ప్రొక్యూర్‌మెంట్, టెండరింగ్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలులో కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన బృంద సభ్యులకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. అనంతరం అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

ప్రపంచ బ్యాంక్, ఆసియా బ్యాంక్ బృందానికి అమరావతి ప్రాంతంలో అమలవుతున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల అమలు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తున్న విధానం గురించి సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు వివరించారు. అమరావతి ప్రాంతంలో అమలు చేస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలు, నిర్మాణ కార్యకలాపాలు జరిగే చోట కార్మికుల భద్రతకు అమలు చేస్తున్న కార్యకలాపాలను గురించి ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులకు వివ రించారు. తొలిరోజు జరిగిన సమావేశాలలో రాజధాని అమరావతి నిర్మాణ కార్యకలాపాలపై అధికారులు వివ రించిన వివిధ అంశాలు, కార్యాచరణ, ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, ఫిర్యాదులు పరిష్కరిస్తున్న విధానంపై ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులు పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు.


బ్యాంకు అధికారులతో సమావేశమైన సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు







సుర్రుమంటున్న సూరీడు

వేసవికాలం ప్రారంభం అయ్యింది. మార్చి రెండోవారంలో సూరీడు సుర్రుమంటున్నాడు. రెండు, మూడు రోజుల నుంచి ఎండలు ముదురుతుండగా.. ఉదయం పదిగంటల నుంచే సూర్యుడు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ దెబ్బకు, వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించగా.. మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతూ కనిపించారు. ఎండ నుంచి రక్షణ కోసం గొడుగులు.. స్కార్ఫ్‌లు వినియోగించారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి




విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వాలీబాల్‌ను ఆడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

పెండింగ్ లేకుండా పనులు నిర్వహించాలి


సామాజక తనిఖీలో మాట్లాడుతన్న పీడీ విజయలక్ష్మి

చినగంజాం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఉపాధి హామీ పనులు పెండింగ్ లేకుండా నిర్వహించాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-2024వ సంవత్సరంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో పీడీ మాట్లాడుతూ మండలంలో జరిగిన పనులకు, కూలీల వేతనాలు త్వరలో బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రికార్డులలో సంతకాలు మస్టర్లలో తప్పులు లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. మండల పరిధిలో ఉద్యానవపంటలు ఎక్కువగా వేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధిహామీ పథకం పలు శాఖల సమన్వయంతో ముడిపడి ఉంటుందని అన్నారు. పలు గ్రామాల్లో సామాజిక తనిఖీలో గుర్తించిన పలు లోపాలైన కూలీల సంతకాలు లేకుండా బిల్లు ఇవ్వడం, వేసిన కరకట్ట కరిగిపోవడం, ప్లాంటేషన్‌లో లోపాలు తదితర విషయాలను డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. చినగంజాం మండలంలో 1046 పనులకు రూ.11.25 కోట్లు ఖర్చు చేసినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, డీపీవో శోభన్‌బాబు, ఎస్ఆర్‌పీ చిరంజీవి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్, ఏ.పీ.డి కోట నాయక్, ఏపీవో జె.లక్ష్మీదేవి, డీఆర్‌పీలు చిట్టిబాబు, రంజిత్‌కుమార్, గ్రామ కార్యదర్శులు ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

స్టోర్ మేనేజర్‌పై నిర్వాహకుల ఫిర్యాదు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ స్టోర్ మేనేజర్ రూ.10లక్షల అవకతకలకు పాల్పడినట్లు నిర్వాహకులకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ కుటుంబ సభ్యులను పిలిపించి ఆరా తీస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

మళ్లీ తెరపైకి ఆదరణ

- కులవృత్తిదారులకు పరికరాలు
- 90శాతం సబ్సిడీతో యూనిట్లు
- అందజేయనున్న ప్రభుత్వం

ఒంగోలు నగరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. రాష్ట్రంలో కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి అవసమైన వస్తువులను 90శాతం సబ్సిడీపై అందజేయనున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 1997-99 సంవత్సరంలో ఆదరణ-1, 2018-19లో ఆదరణ-2 పథకం కింద వృత్తిదారులకు వారికి అవసరమైన పరికరాలు అందజేసింది. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా అ టకెక్కించేసింది. ఈ పథకం కింద 335 రకాల వృత్తి పరికరాలను ప్రభుత్వం గతంలో అందజేసింది. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు సంబంధించిన అన్ని పథకాలను నిలిపేసింది. ఆదరణ పథకాన్ని కూడా పక్కనపెట్టింది. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ బీసీలకు మంచిరోజులు వచ్చాయనుకుంటున్నారు. ఆదరణ-3 పేరుతో రాష్ట్రప్రభుత్వం కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలోని కులవృత్తులతో జీవిస్తున్న వేలాది మంది బీసీలకు వారికి అవసరమైన వస్తువులను అందజేసేందుకు సిద్ధమైంది.

కులవృత్తిదారులకు భారీగా లబ్ధి

జిల్లాలో 15 వేల నుంచి 20వేల మంది దాకా ఆదరణ పథకం కింద లబ్ధి చేకూరనుంది. వృత్తిదారుల అ వసరాలను తెలుసుకుని వారికి ఉపయోగపడే పరికరాలను ఆదరణ-3 పథకం కింద అందజేయనున్నారు. ఇందులోభాగంగా సోమవారం కలెక్టర్ సమావేశంలో హాలులో బీసీ కార్పొరేషన్ అధికారులు వివిధ కుల వృత్తిసంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈడీ వెంకటేశ్వరరావు, బ్యాంకు అధికారులు సంఘాల నాయకులతో సమావేశమై వారికి అవసరమైన వృత్తిపరికరాల వివరాలను తెలుసుకున్నారు. వీటినే వారికి 90శాతం సబ్సిడీతో అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో కులవృత్తిదారులతో బీసీ కార్పొరేషన్ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం వృత్తి పరికరాలను అందజయనున్నారు. ఈ ప్రక్రియ అంతా నెల రోజుల్లోనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

సెల్‌ఫోన్‌పై తలోమాట

- ఎవరి మాట వినాలో తెలియని అయోమయం
- తలలు పట్టుకుంటున్న చీఫ్‌లు

ఒంగోలు విద్య, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ వినియోగంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తలా ఒక మాట చెప్తున్నారు. దీంతో ఎవరి మాట విని ముందుకు పోవాలో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఏమి చేయాలో పాలుపోక పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తలలు పట్టుకుంటున్నారు. పరీక్షల నిర్వహణలో గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గత ఏడాది నుంచి కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించింది. రెండేళ్ల క్రితం వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాలు బయటకు లీకు కావడంతో ముందుజాగ్రత్తగా పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లను నిషేధించారు. ఈ ఏడాది కూడా ముందుగానే పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించి సెల్‌ఫోన్లను అనుమతించేది లేదని స్పష్టంచేశారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లపై వెబెక్స్ ద్వారా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ఆర్జేడీలు ఇతర జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావే శంలో కూడా సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టంచేశారు. దీంతో కేంద్రాల్లోకి చీఫ్‌లు, డీవోలు, ఇన్విజిలెటర్లు, ఏఎన్ఎంలు, పోలీసులు ఫోన్లు తీసుకరావద్దని ఆదేశించారు. అయితే పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు నిర్వహించిన వెబెక్స్‌లో చీఫ్‌లు మాత్రమే ఆండ్రాయిడ్‌లు కాకుండా ఇతర మాములు ఫోన్లను వాడవచ్చన్నారు. ఏదైనా అత్యవసరమైతే వినియోగించాలని ఆదేశించారు. పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి కూడా మామూలు ఫోన్‌ను చీఫ్‌లు పరీక్షా కేంద్రాలకు తేవచ్చన్నారు.

డ్వామాలో బదిలీలు పారదర్శకంగా జరిగేనా?

- మ్యూచువల్‌గా దశాబ్దాల తరబడి అద్దంకి ప్రాంతంలోనే తిష్ట
- అదే అధికారులు కావడంతో వైసీపీ పాలనలో భారీగా అవినీతి
- తప్పులు బయటపడకుండా జాగ్రత్తలు
- అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్‌లు, ఎనిమిది మంది టెక్నికల్ అసిస్టెంట్‌లకు స్థానచలనం?


బల్లికురవలో జరిగిన ప్రజావేదికలో ఉపాధి పనుల తప్పులపై ప్రశ్నిస్తున్న అధికారులు (ఫైల్)

అద్దంకి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది బదిలీకి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో మూడు సంవత్సరాలుగా ఒకే చోట పనిచేసిన అధికారులు, సిబ్బంది బదిలీకి అవకాశం ఏర్పడింది. అయితే ఈ బదిలీలు చిత్తశుద్ధితో జరుగుతాయా లేక మొక్కుబడిగా జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు అధికారులు, సిబ్బంది దశాబ్దాలుగా అద్దంకి నియోజవకర్గాన్ని వీడకుండా ఇక్కడే తిష్ట వేసి ఉండడం, బదిలీల సమయంలో మ్యూచువల్ బదిలీలు చేయించుకుంటూ చేసిన తప్పులు బయట పడకుండా జాగ్రత్త పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వైసీపీ హయాంలో అద్దంకి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. వివిధ ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పెట్రోల్‌బంక్‌లు ఇతర పనులు చేసుకుంటున్న వ్యక్తులతో పాటు రాజకీయనాయకులకు కూడా మస్టర్‌లు వేస్తూ.. వేయిస్తూ... వైసీపీ నా యకులకు పంచుతూ..... తాము దండిగా తిన్నారు. పెద్ద ఎత్తున అవినీతి జరిగినా... సోషల్ ఆడిట్‌లో బయట పడుతుంది మాత్రం స్వల్పమే అన్న విమర్శలు ఉన్నాయి. సోషల్ ఆడిట్ కూడా ఎలాంటి ప్రచారం నిర్వహించకుండానే మొక్కుబడిగా నిర్వహిస్తూ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో ఉపాధి హామీ పనుల ద్వారా ఇబ్బడి ముబ్బడిగా దోచుకోవడానికి అలవాటు పడి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు అధికారులు అదే పంథాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. అప్పటి అధికారులు, సిబ్బంది ఇప్పటికీ విధులు నిర్వహిస్తుండటంతో నాటి అక్రమాలు వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం 3 సంవత్సరాలు నిండిన అధికారులు, సిబ్బందిని బదిలీ చేయనుండడంతో ఇదే ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకునేందుకు సర్వశక్తు లొడ్డుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే దశాబ్దాల తరబడి ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ అవినీతిని వెలుగులోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో కూడా మ్యూచువల్ బదిలీలు పొందడంతో అక్కడ అవినీతి బయట పెట్టవద్దు... ఇక అవినీతి బయట పెట్టను అనే సిద్ధాంతాన్ని అవలంబిచినట్లు తెలుస్తుంది. ఇదే విధంగా ప్రస్తుత బదిలీల లోనూ పోస్టింగ్‌లు తెచ్చుకొని ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా మాకు తిరుగులేదు అనే విధంగా వ్యవహరించాలనే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుసగుసలు వినవస్తున్నాయి. వీరి ప్రయత్నాలు ఫలిస్తాయా లేక బదిలీలు పారదర్శకంగా జరిగి వేరే ప్రాంతానికి బదిలీ అవుతారో వేచి చూడాల్సి ఉంది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ఏపీవోలు, 5 గురు కంప్యూటర్ ఆపరేటర్ లు, 8 మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు తప్పని సరిగా బదిలీ జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది. ఇదే అధికారులు, సిబ్బంది కొనసాగితే నాటి అ క్రమాలు వెలుగులోకి రాకపోగా.. ప్రస్తుతం కూడా అక్రమాలకు తెరలేపే అవకాశం లేకపోలేదన్న విమర్శలు వినవస్తున్నాయి.

సిద్ధమౌతున్న సీఆర్‌డీఏ భవనం

(5వ పేజీ తరువాయి)

వచ్చేలా భవనాన్ని 2 లక్షల 43వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపొందిస్తున్నారు. ఈ భవనం గ్రౌండు ఫ్లోర్‌లో ఎంట్రన్స్ లాబీతోపాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్, కిచెన్, సర్వర్ రూమ్స్, బ్యాంకు, ఏటీఎం తదితరాలను ఏర్పాటు చేస్తున్నారు. వెనుక భాగంలో ఫైర్ సేఫ్టీ భవనం, పవర్‌హౌస్‌ను నిర్మించనున్నారు. మూడు ఫ్లోర్లను సీఆర్‌డీఏ కేటాయించనుండగా తొలి అంతస్తులో ఐదు సెమినార్ హాల్స్, రిసెప్షన్ ఏరియా, రిజిస్ట్రేషన్ చాంబర్, లంచ్ హాలు ఉంటాయి. 240 సీటింగ్ సామర్థ్యంతో ఏవీ సెమినార్ హాలు సౌండు ప్రూఫ్, ఉడెన్ కార్పెట్ ఫ్లోరింగ్‌తో నిర్మిస్తున్నారు. సెకండ్ ఫ్లోర్‌లో కార్యాలయ సిబ్బంది క్యాబిన్లు, ఓపెన్ వర్కు స్టేషన్లు, అడిషనల్ కమిషనరు చాంబర్లు, ఐటీ హబ్, ప్రింటర్ చాంబర్లు ఉంటాయి. మూడో అంతస్తులో కమిషనరు చాంబర్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, సిబ్బంది ఓపెన్ వర్కు స్టేషన్లు ఉంటాయి. తర్వాతి రెండు ఫ్లోర్లను ఏడీసీ(అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కార్యాలయానికి కేటాయించారు. కార్యాలయాల కోసం వినియోగిస్తారు. ఆరు, ఏడు ఫ్లోర్లను ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇవ్వనున్నారు. ఇక ఈ భవనానికి తూర్పు వైపున మూడు, ఉత్తరం వైపున రెండు, పడమర వైపున రెండు లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు.


2024 అక్టోబరు 16న పూజచేసి భవన పునఃనిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

పనులతో మళ్లీ కళకళ

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా అమరావతిపై కక్ష కట్టి ఎక్కడికక్కడ పనులు నిలిపివేసింది. ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రావడంతో అమరావతిలో మళ్లీ రాజధాని కళ కనిపించడం మొదలైంది. ఈ క్రమంలోనే దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో పనులను పునఃప్రారంభించేందుకు అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నద్ధం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చీ రావడంతోనే జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. గతేడాది అక్టోబరు 19న సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవన పనులను పునః ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు సివిల్ పనులు పూర్తి చేశారు. తొలి నాలుగు అంతస్తులలో ఫ్లోరింగ్ పనులు చేస్తున్నారు. ఇంటీరియర్ వర్కులను కూడా సమాంతరంగా చేపట్టారు. ఇంటీరియర్‌లో ఆర్కిటెక్‌కు ప్రాధాన్యమిస్తున్నారు.


కళాశాలలోని ఓ హాస్టల్ భవనం దుస్థితి ఇది

అలుమ్నికి.. ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

మూటగట్టుకుంటోంది. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను ఐదు సంకలనాలుగా పుస్తకాల రూపంలో తీసుకొస్తే వాటిని భావితరాలకు అందించడంలోనూ వర్సిటీ నిర్లక్ష్యంపై అలుమ్ని తప్పుబడుతోంది.

పరిగణనలోకి తీసుకోని వర్సిటీ

ఏజీ కళాశాలలో వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. పోతన వసతి గృహం మూతపడగా, వేమన, సిద్ధార్థ హాస్టల్ భవనాలు పెచ్చులూడుతూ విద్యార్థులను భయపెడుతున్నాయి. ఆ ఫొటోలను ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ఖాతాకు ట్యాగ్ చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనాల నిర్మాణానికి వర్సిటీ నుంచి నిధుల మంజూరు అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పూర్వ విద్యార్థుల్లో కొందరు నిధులు ఇవ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే వారిని యూనివర్సిటీ పెద్దలు అసలు పరిగణనలోకి తీసుకోవడంలేదని సమాచారం. సేద్యంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్లు బోధనా పద్ధతులలో కూడా మార్పు రావాల్సి ఉంది. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు మొదలుకుని ల్యాబ్స్ వరకు అన్ని వర్సిటీనే భరించాలంటే నిధుల కొరత ప్రతిబంధకంగా ఉంది. ఈ పరిస్థితుల్లో నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చే పూర్వ విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా యూనివర్సిటీ ఆలోచన చేయాల్సి ఉంది. వర్సిటీ పెద్దలు చొరవ తీసుకుని అలుమ్నితో సమావేశమై వారి వైపు నుంచి అందాల్సిన సహకారంపై స్పష్టత ఇవ్వగలిగితే భారీ విరాళాలు వచ్చే అవకాశం ఉంది.

నేటి నుంచి రెండో దశ పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో రెండవ దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాంతంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. అందులో ఈనెల 10న తొలి విడతగా ఒంగోలు-1, పొదిలి, కొండపి, కందుకూరు-1 కేంద్రాల్లో కొనుగోళ్లను బోర్డు అధికారులు చేపట్టారు. గరిష్ఠ ధర కిలో రూ.280తో వేలం కొనసాగుతోంది. అయితే గ్రేడింగ్ సరిగా లేదంటూ కొన్ని బేళ్లను కంపెనీల ప్రతినిధులు తిరస్కరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండవ దశ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు-2, కలిగిరి డీసీపల్లి కేంద్రాల్లో బుధవారం ఉదయం వేలం ప్రక్రియ ప్రారంభమవుతుంది. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాలలో వేలం ప్రక్రియను ప్రారంభించనున్నట్లు బోర్డు వర్గాల సమాచారం. కాగా మూడవ విడతగా ఈనెల 24 నుంచి ఉత్తరాది వేలం కేంద్రాలుగా పిలిచే రాజమండ్రి రీజియన్‌లోని మిగిలిన ఐదు కేంద్రాల్లో వేలం ప్రారంభించనున్నారు.

ఎత్తిపోతలతో ఆరుతడులకు నీరు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చి రైతులకు ఆరుతడులకు నీటిని అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగా విశ్రాంత ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీఎస్) డీఈ సత్యన్నారాయణ నేతృత్వంలో నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను పరిశీలించి మరమ్మతులకు కావలసిన నివేదికను తయారు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అందులో భాగంగా మంగళవారం మండలంలోని అన్నంబొట్ల వారిపాలెంలోని ఓగేరు వాగుపై నిర్మించిన అన్నంబొట్లవారిపాలెం ఎత్తిపోతలను రైతులతో కలసి అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి తదితర అంశాలను చర్చించారు. ఈ పథకం ద్వారా ఏమేరకు రైతుల పంట పొలాలకు ఆరుతడులు అందించడానికి దోహద పడుతుంది అన్న విషయంపై నేరుగా పంట భూములను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగని నివేదికను తయారు చేసి ఎమ్మెల్యేకి అందజేస్తామని విశ్రాంతి డీఈ తెలిపారు. కార్యక్రమంలో అప్పలనేని నరేంద్ర, వెంకటేశ్వర్లు, నారాయణ రావు, గోరంట్ల భాస్కరర్‌రావు, చిలుకూరి లక్షణస్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.


రైతులతో చర్చిస్తున్న ఐడీఎస్ విశ్రాంత డీఈ సత్యనారాయణ

వేటు మొదలు

- డ్వామాలో లోకేశ్వరరావు కమిటీ నివేదికే ఆధారం
- మొత్తం 14మందిపై చర్యలు
- ఒక టెక్నికల్ అసిస్టెంట్ తొలగింపు
- ఇన్‌చార్జి ఏపీడీ జడ్పీకి సరెండర్
- నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్ రద్దు
- మరికొందరి నుంచి నగదు రికవరీ
- పూర్తిస్థాయిలో చర్యలపై సమగ్ర విచారణకు ఆదేశం

ఒంగోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో వైసీపీ ప్రభుత్వంలో పీడీగా కే.శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా పలువురు డ్వామా సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 14 మందిపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో పీడీ జోసఫ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అందులో జడ్పీ నుంచి డిప్యుటేషన్‌పై డ్వామాలో పనిచేస్తున్న ఒకరిని తిరిగి ఆ శాఖకు సరెండర్ చేయగా నలుగురు కంప్యూటర్ ఆపరేటర్ల డిప్యుటేషన్లను రద్దు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ సర్వీసు నుంచి తొలగింపు, నలుగురికి నగదు రికవరీలు పెట్టారు. అలాగే త్రిపురాంతకం మండలంలో 11వ విడత సోషల్ ఆడిట్ అవకతవకలకు సంబంధించి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా శాఖాపరంగా మరోసారి సమగ్ర విచారణకు నిర్ణయించారు. అందులో 10మంది సిబ్బంది ఉన్నారు. అలా మొత్తంగా 24మందిపై చర్యలకు నిర్ణయించారు.


విచారణ కోసం సిబ్బంది నుంచి సమాచారం తీసుకుంటున్న త్రిసభ్య కమిటీ (ఫైల్)

శీనారెడ్డిపై చర్యలకు సిఫార్సు

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో దాదాపు నాలుగున్నర ఏళ్లు డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేశారు. అధికారిగా కన్నా వైసీపీ నాయకుడిగా వ్యవహరించడమే కాక పెద్ద ఎత్తున ఆయన పనిచేసిన కాలంలో డ్వామాలో అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులతో విచారణకు ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించింది. ఆ కమిటీ డిసెంబరు, జనవరి నెలల్లో విచారణ నిర్వహించింది. ఆ నివేదిక జనవరి ఆఖరులో కలెక్టర్‌కు అందగా దానిని పరిశీలించిన అన్సారియా అవినీతి, అక్రమాలు జరిగాయని శీనారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అదే సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలువురు డ్వామా జిల్లా కార్యాలయ, అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది పేర్లను కమిటీ ప్రస్తావించింది. వారిపై కూడా శాఖాపరంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను ఆదేశించారు. దాదాపు నెలరోజులకు పైగా పీడీ, కార్యాలయ సంబంధిత సిబ్బంది ఆయా అంశాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదించగా కఠిన చర్యలకు ఆదేశించారు.

- డిప్యుటేషన్‌పై శీనారెడ్డి పాలన సమయంలో జడ్పీ నుంచి డ్వామాకు వచ్చి తొలుత విజిలెన్స్ సూపరింటెండెంట్‌గా అనంతరం ఒంగోలు క్లస్టర్ ఇన్‌చార్జీ ఏపీడీగా పనిచేస్తున్న పి.వెంకటస్వామి డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి జడ్పీకి పంపించి వేశారు.
- డ్వామా జిల్లా కార్యాలయంలో పనిచేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధనాల సురేష్, దాసరి సురేష్, ఏపీవో నాగేశ్వరరావు, ఈసీ ప్రవీణ్‌కుమార్‌ల డిప్యుటేషన్లను రద్దుచేశారు.
- విధులకు హాజరు కాకుండానే జీతాలు డ్రా చేసినట్లు తేలడంతో డ్వామా కార్యాలయంలోని టెక్నికల్ అసిస్టెంట్ తోట నవీన్‌ను సర్వీసు నుంచి తొలగించారు.
- కనిగిరి ఏపీడీ ఆఫీసులోని కంప్యూటర్ ఆపరేటర్‌ను మరో క్లస్టర్‌కు, అలాగే డ్వామా కార్యాలయంలోని ఆఫీసు సబార్డినేటర్ వై.చేజర్లను మరొక సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.
- టంగుటూరు మండల ఈసీ దివికుమార్, వైపాలెం మండలంలోని టీఏలు వి. లక్ష్మయ్య, జి.శివరామరెడ్డి, పెద్దారవీడు మండలం టీఏ ప్రవీణ్‌కుమార్‌ల నుంచి నగదు రికవరీకి ఆదేశించారు.
- త్రిపురాంతకం మండలంలో 2019లో జరిగిన 11వ విడత సోషల్ ఆడిట్‌లో సుమారు రూ.3కోట్లు అవినీతి జరిగినట్లు గుర్తించారు. 10మంది సిబ్బందిని సస్పెండ్ చేసి తిరిగి అక్కడే కొద్దిరోజులకే పోస్టింగ్‌లు ఇవ్వగా ఆ విషయాన్ని లోకేశ్వరరావు కమిటీ ప్రశ్నించింది. దీంతో సదరు వ్యవహారంపై మరోసారి శాఖాపరమైన విచారణ చేపట్టాలని భావించారు. జిల్లా విజిలెన్స్ అధికారి, నాణ్యత నియంత్రణ విభాగాధికారి, మార్కాపురం ఏపీడీలతో త్రిసభ్య కమిటీని నియమించారు.
- ఒంగోలు సీఎల్ఆర్‌సీ పరిధిలో రూ.10లక్షలను ఆఫీసు అటెండర్ చల్లా శేషారావు చెక్కులపై ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసిన వ్యవహారంలో సరైన చర్యలను నాటి పీడీ శీనారెడ్డి తీసుకోకుండా అతనిని సస్పెండ్ చేసి ఆ వెంటనే డబ్బు రికవరీ చేశాడంటూ పోస్టింగ్ ఇచ్చారు. ఆ విచారణ తీరును కమిటీ ప్రశ్నించింది.

తొలగిన అడ్డంకులు

అద్దంకి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వెళ్లే వాహనాలకు అడ్డంకులు తొలగాయి. శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా వాహనాలను కట్టడి చేసేందుకు 99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నామ్ రోడ్డులో సిమెంట్ దిమ్మెలు, బోర్డులను అడ్డుగా పెట్టారు. దీంతో అద్దంకి వైపు నుంచి శింగరకొండకు బస్సులు వెళ్లే వీలు లేకుండా పోయింది. దీంతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పోలీస్ అధికారులు స్పందించారు. అడ్డుగా వేసిన దిమ్మెలను నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో తొలగింప చేశారు. బోర్డులను పోలీస్ సిబ్బంది మంగళవారం తొలగించి రాకపోకలకు వీలుగా సిగ్నల్ బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో కొండకు అన్ని వాహనాలు వెళ్తున్నాయి.

రేపు జాబ్‌మేళా

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు జాబ్ మేళా చక్కని అవకాశమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, జవహర్ నాలెడ్జ్ కేంద్రం సంయుక్తంగా గురువారం వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. నిరుద్యోగులు హాజరై ఉపాధి అవకాశాలను పొందాలని వారు కోరారు.

చేనేతలకు చంద్రన్న చేయూత

- నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- హామీ నెరవేర్చిన సీఎంకు నేతన్నల అభినందనలు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేతలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. గతంలో ఉన్న ఉచిత 100యూనిట్ల విద్యుత్‌ను 200కు పెంచుతామని స్పష్టం చేశారు. అలాగే పవర్‌లూమ్‌కు కూడా 500 యూనిట్లు ఇచ్చే విధంగా రెండు హామీలు చేశారు. ఈక్రమంలో సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రెండు హామీలను అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో చీరాల నియోజకవర్గ పరిధిలోని చేనేత కుటుంబాలు అభినందనల జల్లు కురిపించాయి. గత ప్రభుత్వం అరకొర హామీలు చేసిన అమలు ప్రక్రియలో తీవ్రమైన కోతలు విధించినట్లు చెప్తుతున్నారు. తాజాగా టీడీపీ కూటమి తీసుకున్న నిర్ణయంతో థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేస్తున్నారు.


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికురాలు సువర్ణ

పూట గడవడం కష్టంగా ఉండేది



అనుకోని రీతిలో నా భర్త సుమారు ఐదేళ్ల కిందట గుండెపోటుతో మరణించారు. దీంతో ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబం ఆర్థికపరమైన సమస్యల్లో కూరుకుపోయింది. మరోవైపు అప్పటి పలు రకాల పరిస్థితులతో చేనేత రంగానికి సంబంధించి ధరలు పెరిగి, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నాం. దీంతో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. చాలా ఆనందంగా ఉంది.

- లేళ్ల సునీత, చేనేత కార్మికురాలు

మాట మార్చ లేదు, మడమ తిప్పలేదు



ఎన్నికల హామీలు అందించే క్రమంలో టీడీపీ కూటమి మాట మార్చలేదు, మడమ తిప్పలేదు. ఇచ్చిన హామీలో భాగంగా నేతన్నల నివాసాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పవర్ లూమ్‌కు 500 యూనిట్లు అందిస్తున్నట్లు ప్రకటించడం ఆనందదాయకం. చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- మాన్యం రాము, చేనేత కార్మికుడు



ఉప్పుమాగులూరులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఎత్తిపోతలను వినియోగంలోకి తెస్తాం

మరమ్మతులపాలైన పథకాలను పరిశీలించిన ఐడీసీ అధికారులు

బల్లికురవ. మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు గురై నిరుపయెగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను వినియెగంలోకి తీసుకు వచ్చే చర్యలు చేపడుతున్నామని నీటి పారుదల శాఖ (ఐడీసీ) ఈఈ సిరాజ్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ మండలం గుంటుపల్లి, అంబడిపూడి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కోటవారిపాలెం, ఉప్పుమాగులూరు, సంతమాగులూరు మండలం సజ్జాపురం, తంగేడుమల్లి, కామేపల్లి, పెట్లూరివారిపాలెం గ్రామాలలో ఉన్న ఎత్తిపోతల పథకాలను ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో ఉన్న పథకాలను వినియెగంలోకి తెచ్చేలా అవసరమైన నిధులపై ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎత్తిపోతల పథకాలు పని చేసేలా ప్రణాళిక మేరకు నిధులు మంజూరు చేయిస్తామని వారు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కొంతకాలంగా పథకాలు పనిచేయడం లేదని ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించి అన్ని పథకాలను పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశాలు ఇచ్చిందని వారు తెలిపారు. ఆనంతరం వారు గ్రామాలలో రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఏఈలు కృష్ణారావు, వంశీకృష్ణ, విజయభాస్కర్, నీటి సంఘాల అధ్యక్షులు కోయ పేరయ్య, కక్కెర సుబ్బారావు, దద్దాల విజయ్, దర్శి రామస్వామి పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కు శ్రీహర్షిణి వెల్‌కం


సునీత విలియమ్స్‌కు స్వాగతం పలుకుతూ మార్టూరు సెంటర్లో శ్రీహర్షిణి విద్యాసంస్థల విద్యార్థులు మానవహారం

మార్టూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంతరిక్షం నుంచి భూమ్మీదికి వస్తున్న సునీత విలియమ్స్‌కు శ్రీహర్షిణి విద్యా సంస్థల విద్యార్థులు మంగళవారం వెల్‌కం చెప్పారు. ఈసందర్భంగా విద్యాసంస్థ నుంచి విద్యార్థినీవిద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీగా మార్టూరు సెంటరు వరకు వచ్చారు. అనంతరం సునీత విలియమ్స్‌కు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. తరువాత పెద్ద అండరుపాస్ వద్ద విద్యార్థులు ఆమెకు సంఘీభావంగా మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఏవో అజయ్, ఉపాధ్యాయులు సాంబశివరావు, సంపూర్ణ, అంజలి, సౌమ్య, స్వామి శివప్రసాద్, పార్వతి, నిర్మల పాల్గొన్నారు.


కళాశాల ప్రతినిధులకు ఏగ్రేడ్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

కేఆర్‌కే కాలేజీకి ఏగ్రేడ్ ప్రదానం

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం కమిషనరేట్ కాలేజీ ఎడ్యుకేషన్ నుంచి అకడమిక్ అడిట్ సభ్యులు సందర్శించారు. కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాశాలకు 2023-24 అండ్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏగ్రేడ్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. సర్టిఫికెట్‌లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావుకు అందజేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అడిట్ సభ్యులను శాలువతో సత్కరించారు.

వైపే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు..


కళాశాల ప్రతినిధులకు ఏగ్రేడ్ పత్రాన్ని అందిస్తున్న అధికారులు

చీరాల : వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అకడమిక్ ఆడిట్‌లో ఏ గ్రేడ్ లభించింది. మంగళవారం ఆడిట్ నిర్వహించిన అధికారులు సంబంధిత పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే అకడమిక్ ఆడిట్ 2023-24,25 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు కళాశాల విద్యా కమిషన్ డైరెక్టర్ రేపల్లె ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ అధ్యాపకులు డా. ఎం.నరసయ్యను, కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా. కె.సుజాతను నియమించారు. ఈక్రమంలో మంగళవారం వారు కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, వర్చువల్ తరగతి గదులు, సెమినార్ హాల్, క్యాంటీన్‌లతో పాటు పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. ఈక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎస్.మురళికి ఏ గ్రేడ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డా.ఎస్.రాజశేఖరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యలో ఈ నెల 20వ తేదీన అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు అమరరాజా, ఐఆర్ఎస్‌టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ(ఎన్ఐటీ) కంపెనీలు హాజరవుతున్నాయని, 100కిపైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, బీటెక్, ఎంబీఏ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు రెజ్యూం, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9542970871, టోల్ ఫ్రీ నెంబరు 9988853335 సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశ్రాంత న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు విశ్రాంత న్యాయాధికారి, సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ ఎన్. విక్టర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. బాపనమ్మ కల్యాణ మండపంలో మంగళవారం డీఈ జాన్ థామస్ ఆధ్వర్యంలో విద్యుత్ లోక్ అదాలత్, విద్యుత్ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్జీదారుల నుంచి అందిన 19 సమస్యలను స్వీకరించి 16ను అక్కడిక్కడే పరిష్కరించారు. మిగిలిన మూడు సమస్యలు నిర్దేశించిన కాల పరిమితిలో పరిష్కరించినున్నట్లు చెప్పారు. సివిల్, కోర్టు పరిశీలనలో ఉన్న వాటిని మినహాయించి అధికలోడు, మీటర్ సమస్యలు, బిల్లుల పెండింగ్, నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు వంటి సమస్యలు సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం పొందాలని వివరించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, బాపట్ల సూపరింటెండెంట్ జీ ఆంజనేయులు, డీఈఈ హరిప్రసాద్‌రావు ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఫోరం అధ్యక్షుడు విశ్రాంతి న్యాయాధికారి విక్టర్ ఇమ్మానియేల్

ఆస్తి విషయమై మారు తల్లిపై కొడుకు దాడి

వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

పంగులూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం మారు తల్లిపై కొడుకు కర్రతో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి రేణంగివరం గ్రామంలో జరిగింది. గాయపడిన కోటేశ్వరమ్మ పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి సమాచారం మేరకు.. మండలంలోని రేణంగివరం గ్రామానికి చెందిన శీలం లక్ష్మారెడ్డికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య పేరు కొండమ్మ, రెండవ భార్య పేరు కోటేశ్వరమ్మ. కొండమ్మకు ఒక కుమారుడు కాగా, కోటేవ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు. కొంత కాలం కిందట లక్ష్మారెడ్డి అనారోగ్యంతో చనిపోగా కొడుకు, కూతుళ్లు కలసి కర్మ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మారెడ్డికి రేణంగివరంలో రెండు ఇళ్లు, కొంత పొలం ఉంది. లక్ష్మారెడ్డి మరణానంతరం ఆయన కుమారుడు ప్రసాదరెడ్డి కోటేశ్వరమ్మ, ఆమె కుమార్తెలకు ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. లక్ష్మారెడ్డి రెండవ భార్య కోటేశ్వరమ్మ నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి పని నిమిత్తం చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెం వెళ్లింది. కోటేశ్వరమ్మ లేని సమయం చూసి మొదటి భార్య కొండమ్మ కుమారుడు ప్రసాదరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి తన అణుయాయులకు ఇంటిని అద్దెకు ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న కోటేశ్వరమ్మ సోమవారం గ్రామానికి చేరుకుని తన ఇంటిలో ఉన్నవారిని ఖాళీ చేయాలని కోరగా, వారు ప్రసాదరెడ్డికి సమాచారమిచ్చారు. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ అక్కడకు చేరుకుని ఇంటిలో నివాసం ఉంటున్న వ్యక్తులతో కలసి విచక్షణా రహితంగా కోటేశ్వరమ్మపై కర్రతో దాడి చేసి గాయపరిచారు. రాత్రి సమయంలో తన తల్లి కోటేశ్వరమ్మకు కుమార్తె శ్రీలక్ష్మి ఫోన్ చేయగా బదులివ్వక పోవడంతో శ్రీలక్ష్మి తల్లి ఇంటి వద్దకు చేరుకుంది. అక్కడ తన తల్లి లేక పోవడం, చెప్పులు మాత్రమే ఉండడంతో రాత్రి 12 గంటల సమయంలో తన తల్లి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. రాత్రి సమయంలో తల్లి కోసం పోలీసులతో కలసి వెతికామని, దాడి ఘటనలో గాయపడిన తన తల్లి కోటేశ్వరమ్మను ఆటోలో అద్దంకి వైద్యశాల వద్ద వదిలి వెళ్లారని, తన తల్లి వైద్యశాలలో చికిత్స పొందుతూ కనిపించిందని శ్రీలక్ష్మి తెలిపింది. ఆస్తి కోసం తన అన్న ప్రసాదరెడ్డి, అతని భార్య అరుణ తన తల్లిని చంపే ప్రమాదం ఉందని, తమకు రక్షణ కల్పించాలని శ్రీలక్ష్మి వేడుకుంటుంది. సోమవారం అర్ధరాత్రి తన తల్లి కోటేశ్వరమ్మ కనిపించడం లేదని ఆమె కుమార్తె శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసిందని, తమ సిబ్బంది ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు వెతికే ప్రయత్నం చేశామని రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. కోటేశ్వరమ్మ గాయాలతో అద్దంకి వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు గుర్తించామని, పూర్తి సమాచారంతో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.


అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కోటేశ్వరమ్మ

రేణుకమ్మ పూజల్లో వెంకటేష్


పూజల్లో పాల్గొన్న వెంకటేష్‌తో దేవస్థాన కమిటీ ప్రతినిధులు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డులోని శ్రీ రేణుకాదేవి అమ్మవారి 34వ వార్షిక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా మంగళవారం నిర్వహిస్తున్న తిరునాళ్లకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. దీంతో దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వెంకటేష్‌తో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై కేసు

చీరాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ మహిళ న్యాయవాదిని మానసికంగా వేధించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల కోర్టులో పనిచేస్తున్న సీనియర్ న్యాయవాది వద్ద కొంతకాలంగా మహిళా జూనియర్ న్యాయవాది పనిచేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సీనియర్ న్యాయవాది మానసికంగా వేధిస్తున్నట్లు విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు బాధితురాలు టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కూరగాయల సాగుకు రాయితీలు

అద్దంకిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందించే రాయితీలను సద్వినియోగపర్చుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించి అధికారులు రైతులతో ఆమె మాట్లాడారు. కూరగాయలు సాగు చేసే రైతులకు సబ్జీ కూలర్లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. 25 కేజీల కెపాసిటీ కలిగిన యూనిట్‌కి పూర్తి ఖరీదు 21 వేలు కాగా 50శాతం రాయితీపై రూ.10500 ఇస్తున్నట్లు తెలిపారు. 50 కేజీల కెపాసిటీ, 100 కేజీల కెపాసిటీల యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 22న ఈ పంట నమోదు తుది జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ రాణి, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హానిలేని పద్ధతులు పాటించాలి

పంగులూరు : రైతులు పంటల సాగులో పర్యావరణానికి హానిలేని వ్యవసాయ పద్ధతులను పాటించాలని మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాలలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కజొన్న పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించాలని శ్రీనివాసరావు రైతులకు సూచించారు. భూసారాన్ని పెంచేందుకు ప్రతి రైతు విధిగా పచ్చిరొట్ట పైరును సాగు చేసి భూమిలో కలియ దున్నాలన్నారు. దీని వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి, సిబ్బంది అలగ్జాండర్, పలువురు రైతులు పాల్గొన్నారు.



కాలువ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ వ్యర్థాల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. టీ గ్లాసు నుంచి వాటర్, డ్రింకి బాటళ్లను తాగి రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో యథేచ్ఛగా పడేస్తున్నారు. దీంతో కాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో మురుగు నీరు ముందుకు పోయే పరిస్థితి లేక తీవ్రమైన కంపు, దోమల బెడద పెరిగింది. మరోపక్క వ్యాపారులు సైతం ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. దీంతో మురుగు కాలువల పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. తరచూ డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నా తిరిగి వ్యర్థాలతో నిండిపోతుంది. ఒకపక్క ప్రభుత్వ యంత్రాంగం స్వచ్ఛాంధ్ర నినాదంతో కార్యక్రమాలు చేస్తున్నా ఇక్కడ పరిస్థితిలో మార్పు కన్పించడం లేదు

- పర్చూరు (ఆంధ్రజ్యోతి)

పాఠశాలల పునరుద్ధరణతో పూర్వవైభవం

- కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల విలీనంతో విద్యార్థులు లేక రెండేళ్లుగా మూత
- కూటమి ప్రభుత్వం రాగానే విలీన నిర్ణయం రద్దు
- తిరిగి ఐదు తరగతులు ఒకేచోట నిర్వహణకు ఉత్తర్వులు
- మోడల్ స్కూల్‌గా మారనున్న వైనం
- తల్లిదండ్రుల హర్షం

బల్లికురవ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకు వస్తున్న నూతన మార్పులతో గతంలో మూతపడి ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల (హెచ్‌ఈ)కి తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. గతంలో వైసీపీ హయాంలో విద్యార్థులతో నిండుకుండలా ఉన్న కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాల నుంచి విలీనం పేరిట 2023లో మూడు, నాలుగు, అయిదు తరగతులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలకు తరలించింది. అప్పట్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విలీనం వద్దని నిరసన కూడా చేపట్టారు. అయినా వైసీపీ పాలకులు పట్టించుకోకుండా విలీనం చేశారు. దాంతో అప్పటి వరకు 80 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల 25 మందికి చేరింది. గదులు ఉన్నా విద్యార్థులు లేకపోవడంతో మూడు తరగతులకు సంబంధించిన గదులు రెండేళ్లగా మూతపడి ఉన్నాయి. ఒకటి రెండు తరగతులు గ్రామంలో ఉన్న ఆదనపు తరగతి గదిలో పనిచేస్తున్నాయి. విద్యార్థులున్న పాఠశాలను అస్తవ్యస్తం చేసిన వైసీపీ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని వారు అవేదన వ్యక్తం కూడా చేశారు. అయిన వారిమాటలను పట్టించుకోక పోవడంతో విద్యార్థులు లేక తరగతి గదులు నిరుపయెగంగా మారాయి. తాజాగా టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను సమూల మార్పులు చేస్తూ గతంలో వైసీపీ చేసిన తప్పులను సరి దిద్దుతు కొప్పెరపాడు పాఠశాల విద్యార్థులు విలీనం నుంచి తిరిగి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొప్పెరపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్పు చేస్తున్నారు. దీంతో మూతపడి ఉన్న పాఠశాలకు తిరిగి పూర్వ వైభవం రానుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల గతంలో మాదిరిగా ఉంటే విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. రానున్న నూతన విద్యా సంవత్సరంలో నూతన మార్పులతో పాఠశాలలు బలోపేతం అవుతాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


కొప్పెరపాడులో విద్యార్థులు లేక మూతపడిన ప్రాథమిక పాఠశాల తరగతి గదులు


గ్రామంలో ఉన్న ఆదనపు తరగతి గదులలో నడుస్తున్న ఒకటి రెండు తరగతులు